విద్యుత్ చార్జీలు తగ్గించాలి

సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దహనం

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు తొలగించాలని లేనిపక్షంలో మరో విద్యుత్ ఉద్యమం తప్పదని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రామచంద్రరావుపేట, పవరుపేట ప్రాంతాల్లో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దహనం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఆదానీతో చేసుకున్న ఒప్పందాన్ని వ్యతిరేకించి విద్యుత్ చార్జీలు పెంచబోమని వాగ్దానం చేశారని, సాక్షాత్తు లోకేశ్ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ వాటిని పగలకొట్టిన విషయాలను కూటమి ప్రభుత్వానికి గుర్తు చేశారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ ప్రకారం విద్యుత్ చార్జీలు పెంచవద్దని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, కె.శ్రీని వాస్, పి.రామకృష్ణ, గుడిపాటి నరసింహారావు, ఎ.శ్యామలరాణి, కె.విజయలక్ష్మి, వి.వి.వి.ఎస్.ప్రసాద్, వై.ఎస్.కనకారావు, జి.రవికిషోర్, పి.ఆదిశేషు, ఎం.అరుణ కుమారి, ఎం.ఇస్సాకు, ఎం.సత్యం, జి.గోపి పాల్గొన్నారు.



ఏలూరు పవరుపేటలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న వామపక్షాల నాయకులు

గౌరవ వేతనం.. మరిచారు!



- ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు గత వైసీపీ ప్రభుత్వం మొండిచెయ్యి
- 15 నెలల గౌరవ వేతనం సుమారు రూ.మూడు కోట్లకు పైగానే అందాల్సిన వైనం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

ఏలూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఆర్థిక విధ్వంసం సాగించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సమయానికి వేతనం ఇవ్వక ఇబ్బందులకు గురిచేశారు. వేతన వెతలు ఉద్యోగులకే కాదు, ప్రజాప్రతినిధులకు తప్పలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు గౌరవవేతనం 15 నెలలుగా అందలేదు. ఏలూరు జిల్లాలో 453 మండలాలు ఉన్నాయి. మండలానికి ఒకరు చొప్పున జడ్పీటీసీలు ఉన్నారు. 1103 ఎంపీటీసీలు ఉన్నారు. 44 జడ్పీటీసీలు ఉన్నారు. ఎంపీపీలకు గౌరవ వేతనం నెలకు రూ.8వేలు, ఎంపీటీసీలకు రూ.3 వేలు చొప్పున అందాల్సి ఉంది. మొత్తం రూ. మూడు కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధిని అటకెక్కించింది. కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించింది. దీంతో ఎంపీపీలు, ఎంపీటీసీలకు అందాల్సిన గౌరవ వేతనం నిలిచిపోయింది. గత వైసీపీ హయాంలో పాలకుల దౌర్జన్యాలు పరాకాష్ఠకు చేరాయి. పోలీసులతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహి స్తున్నారని టీడీపీ ఎన్నికలు బహిష్కరించింది. దీంతో ఎన్నికల బరిలో వైసీపీ మాత్రమే నిలిచింది. 90 శాతం ప్రజాప్రతినిధులుగా వైసీపీ వారే ఎన్నిక అయ్యారు. అధికార పార్టీకి ప్రజా ప్రతినిధులు నిధులు దండిగా వస్తాయని మండలాలు, గ్రామ పంచాయతీలు అభివృద్ధి చేసు కోవచ్చని ఆనందపడ్డారు. వారి ఆశలపై అప్పట్లో వైసీపీ ప్రభుత్వం నీళ్లు చల్లింది. పైసా విదల్చలేదు. పైగా కేంద్రం ఇచ్చిన ఆర్థికసంఘం ఇతరత్రా నిధులను దారి మళ్లించింది. నిధుల పనుల సంగతి దేవుడెరుగు.. చివరకు వారికి గౌరవవేతనమూ దక్కలేదు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం ద్వారానైనా సమాజంలో గౌరవం పొందవచ్చన్నారు. ఆ అవకాశం కూడా ఇవ్వలేదు. నాటి ప్రభుత్వం వార్డు, గ్రామ వలంటీర్లు ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేశారు. దీంతో ప్రజాప్రతి నిధులకు గౌరవ వేతనం, గౌరవం కూడా లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చాలా మండలాల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రభుత్వ కార్యాలయాలకు రావడమే తగ్గించి వేశారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం లేదు. కూటమి ప్రభుత్వం కొలువు తీరాక పల్లెల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వమైనా గౌరవ వేతనం బకాయిలు విడుదల చేయాలని, సక్రమంగా గౌరవ వేతనం అందించాలని స్థానిక సంస్థల ప్రతినిధులు కోరుతున్నారు.

గౌరవ వేతనం పెంచాలి



గత వైసీపీ ప్రభుత్వం ఎంపీటీసీలు, ఎంపీపీ లు, జడ్పీటీసీల వేతనాలు విడుదల విష యంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా నెలనెల విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ప్రజా ప్రతినిధుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీలకు రూ.15వేలు, జడ్పీటీసీలకు రూ.30వేలు చొప్పున గౌరవవేతనం అందించాలి.

కడలి గోపాలరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ ఛాంబర్ అధ్యక్షుడు

జనసేన గ్రామాధ్యక్షుడి జన్మదిన వేడుకల్లో అశ్లీల నృత్యాలు

ఆలస్యంగా వెలుగులోకి.. పార్టీ నుంచి సస్పెన్షన్.. పోలీసుల కేసు నమోదు

నిడమర్రు డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడి పుట్టిన రోజు వేడుకలకు మద్యం ఏరులై పారింది. అమ్మాయిలతో పూర్తి అశ్లీలంగా డ్యాన్సులు చేయించిన ఘటన ఏలూరు జిల్లా నిడమర్రు మండలం క్రొవ్విడిలో కలకలం రేపింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడం, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగి సుమోటోగా కేసు నమోదు చేశారు. ఆ నేతను జనసేన పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. వివరాలివి.. పార్టీ క్రొవ్విడి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు వాకమూడి ఇంద్రకుమార్ పుట్టిన రోజు కావడంతో ఈ నెల 15వ తేదీ రాత్రి సమీపంలోని బావాయిపాలెం రైస్‌మిల్లులో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఏడు గంటల నుంచి నిర్వహించిన పార్టీలో మండల స్థాయి నాయకులతో కేక్ కటింగ్ చేసి వివిధ రకాల నాన్‌వెజ్ వంటకాలతో భారీగా భోజనాలు ఏర్పాటు చేశారు. అందరూ భోజనాలు చేసి ఎవరికి వారు వెళ్లిపోయారు. అర్ధరాత్రి సమయానికి మిగిలిన కొందరు యువకులు అతి ఉత్సాహం ప్రదర్శించారు. అప్పటికప్పుడు సమీప పట్టణానికి చెందిన కొందరు యువతులను పిలిపించి నృత్యాలు చేయించారు. అప్పటికే పూటుగా మద్యం సేవించిన వీరు ఆ మహిళలను పూర్తిగా వివస్త్రలను చేయించడం కలకలం రేపింది. ఈ వీడియోలు బుధవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు నిడమర్రు ఎస్ఐ ఎన్.వీరప్రసాద్ తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పార్టీ అధిష్ఠానం ఇంద్రకుమార్‌ను సస్పెండ్ చేసింది. నిడమర్రు మండల కన్వీనర్ నిమ్మల దొరబాబు బుధవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ ఇంద్రకుమార్‌పై సోషల్ మీడియాలోనూ, కొన్ని ఎలక్ట్రానిక్ ఛానల్స్‌లోనూ వచ్చిన వార్తల ఆధారంగా, అసాంఘిక కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారనే ఆరోపణల దృష్ట్యా ఇంద్రకుమార్‌ను జనసేన గ్రామ పార్టీ పదవి నుంచి, పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు.

రూ.30 కోట్లతో నూజివీడు మార్కెట్ యార్డు అభివృద్ధి

మంత్రి కొలుసు పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):నూజివీడు మామిడికి మరింత ఇమేజ్‌ను పెంచి రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు నూజివీడు మార్కెట్ యార్డును రూ.30 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి, నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు ఏఎంసీలో బుధవారం మామిడి మార్కెట్ ఏర్పాటు, సౌకర్యాల కల్పనపై రైతులు, వ్యాపారస్తులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారని, గత ప్రభుత్వం విస్మరించిన మామిడి పంటకు వాతావరణ ఆధారిత పంటల బీమాను అమలు చేస్తున్నామన్నారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ నూజివీడు ప్రాంతంలోని మామిడి రైతులతో మాట్లాడి, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఈ నేపథ్యంలోనే రూ.30 కోట్లతో మార్కెట్‌యార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత, మార్కెటింగ్ శాఖ జేడీ శ్రీనివాస్, డీడీ లావణ్యవేణి, ఈఈ శ్రీనివాసరావు, ఆర్డీవో ఎం.వాణి, ఉద్యానవనశాఖ అదనపు డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి, డీడీ రామ్మోహన్, మామిడి పరిశోధనాకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుడ్ గవర్నెన్స్ వీక్‌ను విజయవంతం చేయండి : కలెక్టర్

ఏలూరుసిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రశాసన్ గావోన్ కి ఓర్ - 2024 కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఈనెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగే గుడ్ గవర్నెన్స్ వీక్ ప్రచార కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో గుడ్‌గవర్నెన్స్ వీక్ ప్రచార ప్రణాళికపై బుధవారం సంబంధిత అధికారు లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు సమర్థవంత మైన సుపరిపాలన అందించి సకాలంలో వారి సమస్యలకు నాణ్యమైన పరి ష్కారం అందించడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ నెల 23న సుపరిపాలన వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా గోదావరి సమావేశ మందిరం లో వర్క్‌షాప్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో విజయరాజు, డ్వామా పీడీ సుబ్బారావు, డీపీవో అనురాధ, డీపీఆర్వో రామచంద్రరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను సత్వరం అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. కలెక్టరేట్ నుంచి బుధవారం అర్జీల పరిష్కార తీరుపై సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించండి మహాప్రభో



పైపులైన్ మరమ్మతులు నిర్వహిస్తున్న సత్యసాయి కార్మికులు

- తొమ్మిది నెలలుగా వేతనాలు లేవు
- సత్యసాయి మంచినీటి పథకం కార్మికుల ఆకలి కేకలు

పోలవరం డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జీతాల బకాయిలు ఇప్పించండి మహాప్రభో అంటూ సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికులు వేడుకుంటున్నారు. రెండు నెలలుగా అధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో కొవ్వూరు, పోలవరం, గోపాలపురం, చింతలపూడి నియోజక వర్గాల్లో 17 మండలాల్లో 200 గ్రామాలకు గోదావరి నీటిని తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్నామన్నారు. 120 మంది కార్మికులకు తొమ్మిదిన్నర నెలలుగా జీతాలు చెల్లించడం లేదని వాపోయారు. ఇంటి అవసరాలు, పిల్లల స్కూలు ఫీజులు, పెద్దల వైద్యం ఖర్చులు, మందులు, కరెంటు బిల్లు చెల్లించడానికి వడ్డీలకు అప్పు చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలు, కిరాణా సరుకులు ఇచ్చే వ్యాపారులు బకాయిల కోసం ఒత్తిడి చేస్తున్నారని, స్కూలు ఫీజుల కోసం పిల్లలను బయట నిలబెట్టే పరిస్థితులు నెలకొన్నాయని కన్నీటి పర్యంతమవుతున్నారు. సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికుల ఆకలి బాధలు గ్రహించి జీతాల బకాయి వెంటనే చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గతంలో ఎల్ అండ్ టీకంపెనీ ఇవ్వవలసిన బకాయిలు ఇస్తామని చెప్పిన అధికారులు ఇప్పటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సత్యసాయి మంచి నీటి పథకం కాంట్రాక్టరు సత్యనారాయణను వివరణ కోరగా తమకు ప్రభుత్వం రూ.4 కోట్లు బకాయి పడిందన్నారు. కాంట్రాక్టర్లకు సైతం బకాయిలు చెల్లించకపోవడం వల్లనే స్కీం నిర్వహణ, జీతాలు ఇవ్వలేక తప్పుకున్నారన్నారు. 2024-25 సంవత్సరానికి మంచినీటి పథకం నిర్వహణకు మూడుసార్లు టెండ ర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు.

జ్యువెలరీ వ్యాపారి ఇంటిలో తనిఖీలు

- రెండున్నర కేజీల బంగారం, 50 కేజీల వెండి స్వాధీనం
- తాడేపల్లిగూడెంకు క్యూ కడుతున్న బాధితులు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మాన్వీ జ్యువెలర్స్ యజమాని లంకా రమణబాబు బారిన పడ్డ బాధితులు క్యూ కడుతున్నారు. మంగళవారానికి రూ.6 కోట్లకు లెక్క తేలింది. తాడేపల్లిగూడెంతోపాటు నరసాపురం, తణుకు, భీమవరం, ఏలూరు, విజయవాడ ప్రాంతాల నుంచి హోల్‌సేల్ వ్యాపారులు అతని కోసం ఇక్కడకు వచ్చి ఆరా తీస్తున్నారు. మొత్తం సుమారు 25 కేజీల బంగారు ఆభరణాలు, వంద కేజీల వెండి సామగ్రి ఇచ్చినట్లు లెక్కలు వేసుకుని అంచనాకు వస్తున్నారు. డీఎస్పీ విశ్వనాథ్, సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ బాదం శ్రీనివాస్‌లు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. రమణబాబు ఇంటిలో మంగళవారం రాత్రి సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. పరుపు కింద రెండున్నర కేజీల బంగారం బిస్కెట్‌లు, 50 కేజీల వెండి బయట పడినట్లు పోలీసులు చెప్పారు. బాధితులు ఎవరైనా ఉంటే ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు.



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఐసీడీఎస్ పీడీ శారద

ఐసీడీఎస్ పీడీగా శారద బాధ్యతల స్వీకరణ

ఏలూరు క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులైన పి.శారద శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 2013లో గ్రేడ్ వన్ సూపర్‌వైజర్‌గా మహిళా శిశు సంక్షేమ శాఖలో ప్రవేశించిన శారద 2015లో సీడీపీవోగా ఎంపికై పలు జిల్లాల్లో పనిచేశారు. ఇటీవల అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పదోన్నతి పొంది ఏలూరు జిల్లా ఐసీడీఎస్ పీడీగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా విధులు నిర్వహించారు.

తెరుచుకున్న.. ఉండి రైలు గేటు



ఉండిలో ఎన్‌హెచ్ రహదారిలో తెరిచిన రైల్వేగేటు

ఉండి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులుగా మూతపడిన ఉండి రైల్వే గేటు తెరుచుకుంది. నరసాపురం- భీమవరం- విజయవాడ మధ్య రైళ్ల వేగం పెంచేందుకు ఈ నెల 9 నుంచి ఉండి గేటును మూసి తొమ్మిది రోజులపాటు ఇక్కడ ట్రాక్ పనులు చేపట్టారు. ఎల్‌సి గేటు, స్లీపర్లు పనులను పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ పట్టాలపై రైళ్ల స్పీడు గంటకు 110 కిలోమీటర్లు. ఇకపై 130 కిలోమీటర్ల వరకు వెళ్లేలా ట్రాక్‌ను అభివృద్ధి చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. త్వరలో నరసాపురం నుంచి విజయవాడ మీదుగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నడిచే విధంగా ట్రాక్‌ను అభివృద్ధి చేసినట్లు సమాచారం. రైల్వే గేటు తెరవడంతో కైకలూరు, గుడివాడ, విజయవాడ, ఏలూరు, భీమవరం, నరసాపురం మధ్య రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సులను దారి మళ్లించారు. కొన్నింటిని ఇక్కడ వరకు నడిపారు. ఇప్పుడు వాహనదారులంతా ఊపిరి పీల్చుకున్నారు. భారీ వాహనాలు, ఆర్టీసీ, స్కూల్ బస్సులు, ఆటోలు, కార్లు, బైకలతో ఒక్కసారిగా రద్దీ ఏర్పడింది. రైళ్ల రాకపోకలు సాగించినప్పుడు గేటు పడడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది.



ఉండి గేటులో నుంచి వెళ్తున్న వాహనాలు

భీమవరం ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్‌కు రూ.30 కోట్లు ఇవ్వండి
రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ వినతి

పి.గన్నవరం–కోడేరు వారధికి నిధులు ఇవ్వండి
కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఆచంట ఎమ్మెల్యే పితాని వినతి

ఎంపీహెచ్ఏలను విధుల్లోకి తీసుకోండి
సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు.. ఉమ్మడి జిల్లాలో 111 మందికి ఊరట

వీడని ముసురు.. తగ్గని చలి
7

భూ సమస్యలు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలి

జిల్లా అధికారులు, ఈవోలకు దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు

భీమవరం టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా రాష్ట్రంలోని దేవదాయ శాఖకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా ఏఏ అంశాలపై దృష్టిపెట్టి పరిష్కరించుకోవాలో కమిషనర్ ప్రత్యేక సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక టీమ్‌లో దేవదాయ అధికారులు కూడా పాల్గొనాలని ఆదేశాలు ఇచ్చారు.

పరిశీలించాల్సిన అంశాలు ఇవే

దేవదాయ శాఖ భూములు ఉన్న ప్రతీ దేవాలయ అధికారి సెక్షన్ 38 రిజిస్టర్, 43 రిజిస్టర్ కాపీలతో సదస్సుకు హాజరై సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. ఈవోలు లేని ఆలయాలకు సంబంధించి దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కానీ మండల ఎండోమెంట్ అధికారి పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలి. దేవాలయానికి గతంలో ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలపై పార్టీ గుర్తులు, ఫోటోలు ఉన్నట్లైతే వాటిని తహసీల్దార్‌కు ఇచ్చి కొత్త పాస్ పుస్తకాలు తీసుకోవాలి. జగనన్న భూహక్కు ద్వారా రీ- సర్వే జరిగితే అందులో దేవాలయ భూమి తక్కువగా నమోదు జరిగిన సందర్భంలో తప్పనిసరిగా రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చెయ్యాలి. ప్రతీ ఈవో భూములకు సంబంధించి ఆర్ఎస్ఆర్, గ్రామ అడంగల్ 1-బితో సరిచూసుకుని ఏమైనా తప్పులు ఉంటే సదస్సులో రెవెన్యూ అధికారులకు తెలపాలి. పట్టాదార్ పాస్ పుస్తకాలు లేనిచోట పాస్ పుస్తకాలు కోసం ప్రతిపాదనలు అందించాలి. ఎక్కడైతే భూమికి సబ్ డివిజన్ అవసరమో, భూ విస్తీర్ణం, సరిహద్దుల్లో ఉన్న తేడాలు ఉంటే సదస్సులో ఫిర్యాదులు చేసి ప్రతిపాదనలు ఇచ్చి రశీదు పొందాలి. రాష్ట్రంలోని వివిధ ఆలయాల భూములను ఆన్‌లైన్‌లో ఉంచారు. వాటి వివరాలు సరిగా ఉన్నాయా లేదా చూసుకోవాలి. సదస్సుకు వెళ్లినపుడు ఆ గ్రామంలోని సెక్షన్ 22-ఎ(1)(సి) నిషేధిత జాబితాల్లో దేవదాయ శాఖకు చేర్చిన భూముల వివరాల కాపీని ముందస్తుగా తీసుకుని వెళ్ళాలి. లిస్టు లేకుండా గ్రామ సదస్సులకు హాజరైతే తీవ్రమైన చర్యగా భావించాల్సి ఉంటుందని హెచ్చరికలు జారీ చేశారు. ప్రతీ ఈవో నిషేధిత జాబితాలో చేర్చిన భూముల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే సదస్సులో చర్చించి ప్రతిపాదనలను ప్రొఫార్మాలో జిల్లా అధికారి ద్వారా సంబంధిత డిప్యూటీ కలెక్టర్, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్, కాకినాడ, తిరుపతిలకు పంపాలి. సదస్సులు దాదాపు 45 రోజులు జరుగుతాయి కాబట్టి రెండు రోజులకు ఒకసారి వివరాలను ఆన్‌లైన్‌లో కమిషనర్ కార్యాలయానికి పంపాలని ఆదేశాలు జారీ చేశారు.

వట్టిపోతున్న పశువులు





తగ్గుతున్న పాల ఉత్పత్తి
పెరిగిన పెంపకం ఖర్చులు..
తప్పుకుంటున్న పాడిరైతులు

తణుకు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి)

పాడి పశువులు సంఖ్య రాను రాను తగ్గిపోతున్నది. ప్రధానంగా మేలుజాతి పశువులు క్రమేపీ తగ్గిపోతున్నాయి. పశువులను మేపే రైతులు తగ్గిపోతున్నారు. పశువులకు అనారోగ్యం, ఇతర సమస్యలు వచ్చినపుడు సలహాలు, వైద్యం అందుబాటులో లేకపోవడం, దాణా ఖర్చులు, మేత దొరక్కపోవడం వంటి కారణాల వల్ల పశుపోషణ చేసే రైతులు తగ్గిపోతున్నారు. దీనికి తోడు గత వైసీపీ ప్రభుత్వం రైతులకు ప్రధానంగా పశువులకు సంబంధించిన పథకాలు, రాయితీలను పూర్తిగా నిలిపివేసింది. దీంతో చాలా మంది రైతులు పాడి పశువులను పోషించే పరిస్థితి లేకుండా పోయింది.

తగ్గుతున్న పాల ఉత్పత్తి

జిల్లా వ్యాప్తంగా పాల ఉత్పత్తి తగ్గుముఖం పట్టింది. గతం నుంచి చూసినట్లయితే గణనీయంగా పాల ఉత్పత్తి తగ్గింది. అధికారిక గణాంకాలు ఎలా ఉన్నప్పటికి నూటికి 80 కుటుంబాలు పాల ప్యాకెట్లు పాల మీద ఆధార పడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 22-23 మార్చి నాటికి 3 లక్షల 65 వేల 812 మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి జరిగింది. 23-24 సంవత్సరంలో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయినట్లు అధికారులు చెబుతున్నారు. అధికారులు లెక్కలు ఎలా ఉన్నప్పటికీ పాల ఉత్పత్తి బాగా తగ్గిన మాట వాస్తవమే అని రైతులు చెబుతున్నారు.

వట్టిపోతున్న పశువులు

సరైన సంరక్షణ లేకపోవడం, ఇతర కారణాలతో రోజురోజుకు ఒట్టిపోతున్న పశువులు సంఖ్య పెరుగుతోంది. పాల ఉత్పత్తి మీద ఇది చాలా ప్రభావం చూపుతుంది. జిల్లాలో ఆవులు, గేదెలు కలిపి 2 లక్షల 23 వేల 676 పశువుల ఉన్నట్లు చెబుతున్నారు. కేవలం 80 వేల 516 పశువులు మాత్రమే పాలిచ్చే పశువులుగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. పశువులకు అనారోగ్యం చేయడం.. వాటికి అవసరమైన చికిత్సలు అందించలేకపోవడం.. పశువుల సంరక్షణకు పాడి రైతులకు అవసరమైన సూచనలు అందకపోవడం వంటి కారణాలు చెప్పవచ్చు..

గిట్టుబాటు కావడం లేదు



ప్రస్తుత పరిస్థితుల్లో పశువుల పెంపకం చాలా కష్టంతో కూడుకున్నది. పాడి పశువులు మేపా లంటే ఏమాత్రం రైతులకు గిట్టుబాటు అవ్వడం లేదు. దాణా నుంచి షెడ్డులు, కూలీలు, పచ్చగడ్డి, ఎండుగడ్డి వంటి వాటికోసం చాలా వ్యయం అవుతుంది. పెద్ద మొత్తంలో ఖర్చు చేసినప్పటికి వచ్చే పాలదిగుబడితో ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. అందువల్లే చాలామంది రైతులు పశువులను అమ్ముకుంటున్నారు. దానికి తోడు గత ప్రభుత్వంలో ఏమాత్రం పోత్సహకాలు ఇవ్వలేదు.

- యలమంచిలి నాగేశ్వరరావు, మండపాక

ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలి



ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ పశువులతో ఉన్న అనుబంధం కారణంగానే వాటిని సంరక్షిస్తు వస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో చాలా ఇబ్బందికరంగా ఉంది. మేత దొరకడం లేదు..దాణా ఖర్చులు పెరిగిపోయాయి. అయినా సంప్రదాయంగా వస్తున్న పశువులను కాపాడుతున్నాం. కూటమి ప్రభుత్వం పాడి పశువులు, రైతులను పోత్సహించే విధంగా గోకులాలు ఇచ్చింది. ప్రభుత్వం రైతులు పట్ల సానుకూలంగా ఉండాలి.

- పరిమి వెంకటేశ్వరరావు, మండపాక

భక్తి శ్రద్ధలతో ధనుర్మాస పూజలు

గోదాదేవి సమేతంగా ద్వారకాతిరుమల క్షేత్రంలో ఊరేగిన స్వామి, అమ్మవార్లు



ద్వారకాతిరుమల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ధనుర్మాస ఉత్సవం బుధవారం ఉదయం క్షేత్రపుర వీధుల్లో వైభవంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను గోదాదేవి సమేతంగా తొళక్కవాహనంపై ఉంచి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హారతులు ఇచ్చి తరువాత అట్టహాసంగా తిరు వీధులకు తీసుకురాగా ప్రతీ ఇంటి ముందు స్వామివారి దివ్యమూర్తులకు హారతులు పట్టారు. ప్రత్యేక పూజలు, తిరుమంజన సేవలు నిర్వహించారు. ఉదయం రేపాక సుధారాణి వీణాగానం, అనంతరం టీటీడీ ప్రబంధ ట్రస్టు అనుమతి పొందిన నూలి మాధురి తిరుప్పావై ప్రవచనం గావించారు.ఈవో సత్యనారాయణ శంకర్, భక్తులు పాల్గొన్నారు.

అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో..



ప్రత్యేక అలంకరణలో అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి, ఆండాళ్ళు అమ్మవారు

పాలకొల్లు అర్బన్ : ధనుర్మాసం 3వ రోజు బుధవారం పాలకొల్లు అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువ జాము నుంచి ప్రధాన అర్చకులు కె.శ్రీనివాసాచార్యులు, పవన్ కుమార్, వెంకట కృష్ణ మాచార్యులు స్వామి, అమ్మ వారికి



భవాని దీక్షధారుల జ్యోతి ప్రదర్శన



పెనుగొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెనుగొండలో భవాని దీక్షధారులు గ్రామోత్సవం నిర్వహించారు. పుర వీధులలో జ్యోతి ప్రదర్శన నిర్వహించారు. గురు భవానీలు పిల్లి శంకరం, నక్కా వేదవ్యాస శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సర్పంచ్ నక్కా శ్యామలా సోని 250 మంది ముత్తైదువులకు గాజులు, రవికలు పసుపు కుంకుమ అందిచారు.

నత్తా రామేశ్వరం ఆలయ రథానికి మరమ్మతులు



పెనుమంట్ర, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెనుమంట్ర మండలం నత్తా రామేశ్వరంలో స్వామివారి రథానికి మరమ్మతులు, రంగులు వేసేందుకు దాతల సహకారంతో మూడు లక్షల రూపాయలతో పనులు జరిపించేందుకు బుధవారం ఉదయం పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ద్వారంపూడి వీర్రెడ్డి సుశీల దంపతుల కుమారులు ప్రవాసాంధ్రులు ఈశ్వర్ ప్రకాష్, బాపిరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు ముందుకు రావడం అభినందనీయమని పితాని వెంకట్ అన్నారు. దేవస్థానం ప్రధాన అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వర శర్మ అభిషేక పురోహితులు కాశీభట్ల సూర్యనారాయణ మూర్తి దాతల అల్లుళ్ల వాసంశెట్టి వెంకట మురళి కృష్ణారెడ్డి దంపతులు, శ్రీనివాసరెడ్డి దంపతులచే పూజలు నిర్వహించారు. ఈవో యాళ్ల సూర్యనారాయణ మూర్తి, ఎంపీటీసీ తమనం పూడి నాగ వెంకట సత్యనారాయణ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీరామ దుర్గారెడ్డి, గరువు మాజీ సర్పంచ్ కర్రి సుబ్బారెడ్డి, భూపతి రాజు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు





270 కేజీల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో దయాసాగర్..సాధించిన మెడల్స్..

పట్టుపడితే.. పతకమే

వెయిట్ లిఫ్టింగ్‌లో దయా సాగర్ ప్రతిభ

ముదినేపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తన స్నేహితుడి మెడలో గోల్డ్ మెడల్‌ను చూసిన స్ఫూర్తితో తాను కూడా ఆ స్థాయికి ఎదగాలన్న పట్టుదల ఓ యువకుడిని జాతీయ స్థాయి క్రీడాకారుడిని చేసింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆ యువకుడు వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందాడు. పతకాల వీరుడిగా ఘనత సాధించాడు. ముదినేపల్లి మండలం పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెం గ్రామానికి చెందిన పక్కిరి దయాసాగర్ మచిలీపట్నం నోబుల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సమయంలో వ్యాయామ విద్యపై మక్కు కలిగింది. ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుండగా, తన స్నేహితుడు వెయిట్ లిఫ్టింగ్‌లో ఛాంపియన్ షిప్ సాధించడం చూసి తాను కూడ ఆ రంగంలో ప్రతిభ కనబర్చాలని నిర్ణయించుకున్నాడు. 2016లో స్వయంగా వెయిట్ లిఫ్టింగ్ నేర్చుకోవటం ప్రారంభించి, 2018 నాటికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానాలు సాధించాడు. జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన అనంతరం ఏలూరులో కోచ్ బడేటి వెంకట్రామయ్య వద్ద వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందాడు.2022 వరకు కేరళ, బీహార్, నాగపూర్, చెన్నై, చండీగడ్, నోయిడాలో జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి బంగారు, రజిత పతకాలను సొంతం చేసుకున్నాడు.

పతకాల వీరుడు

దయాసాగర్ రాష్ట్రస్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 22 పతకాలు, జాతీయ స్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించాడు. తొలుత 100 కేజీలు, 150 కేజీల బరువులను సునాయాసంగా లేప గలిగిన దయాసాగర్ గరిష్టంగా జాతీయ స్థాయిలో 270 కేజీల బరువును లేపి తన ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాడు.

ప్రోత్సహిస్తే కోచింగ్ ఇస్తా : దయాసాగర్

వెయిట్ లిఫ్టింగ్ మంచి వ్యాయామ విద్య. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ప్రోత్సాహం లభిస్తే ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల యువతీ, యువకులకు వెయిట్ లిఫ్టింగ్‌లో కోచింగ్ ఇస్తా.



ఫుట్‌బాల్‌లో విష్ణు విద్యార్థుల ప్రతిభ

భీమవరం రూరల్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయుకే సెంట్రల్ జోన్ ఫుట్‌బాల్ పోటీల్లో విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విఐటి) విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల పీడీ శ్రీనివాసరావు బుధవారం విద్యార్థులను ఆయన అభినందించి మాట్లాడారు. ఈ నెల 16, 17 తేదీల్లో నర్సాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయుకే సెంట్రల్ జోన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో విఐటి విద్యార్థుల ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వేణు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మిలు అభినందించారు.

ఎన్ఐటీ చెస్ పోటీల్లో మహిళా జట్టుకు ప్రథమ స్థానం



తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): ఆలిండియా ఇంటర్ ఎన్ఐటీ చదరంగ పోటీల్లో తాడేపల్లిగూడెం ఏపీ ఎన్ఐటీ ఫ్యాకల్టీ స్టాఫ్ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచినట్టు రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి తెలిపారు. ఈనెల 13 నుంచి 17 వరకూ అసోంలోని సిల్చర్ ఎన్ఐటీలో నిర్వహించిన ఈ పోటీల్లో యెగ్గిన దీపిక కుమారి (కెప్టెన్) సారథ్యంలో సభ్యులు దేవిన చైతన్య, చెక్కపల్లి కాశీ అన్నపూర్ణలు ప్రతిభ కనబరిచి ఆలిం డియాలో ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలను ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రమణరావు అభినందించారు.



వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు

ఉత్సాహంగా క్రీడా పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాల, ఏపీ నిట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు రెండోరోజు ఉత్సాహంగా సాగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్ ఆటల్లో క్రీడాకారులు రాణించారు. జిల్లాలో 11 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 475 మంది విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. క్రీడలతో ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం, పోటీతత్వాన్ని అలవర్చుకునేందుకు ఉపయోగపడుతున్నాయని చెబుతున్నారు.



» ఖోఖోలో గత సంవత్సరం రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యా. ఈసారి కూడా రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లేందుకు ఒక్క అడుగు దూరంలో ఉన్నాం. సెమీస్‌లో గాయాల వల్ల ఇబ్బంది పడ్డాం. ఈసారి ఆ పరిస్థితి లేకుండా సంసిద్ధమయ్యాం.

-వి.శ్వేత, సీఆర్‌రెడ్డి పాలిటెక్నిక్, ఏలూరు



» గతంలో కూడా రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లాం. కానీ అక్కడ వెనుకబడ్డా ఈసారి ఆ ఇబ్బంది లేకుండా మా కళాశాలను రాష్ట్రస్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం. ఖోఖో అంటే మాకు ప్రాణం. జట్టు ఎంతో బలంగా ఉంది. ఈ పోటీల్లో ముందుకు వెళతాం.

-ఎం.త్రివేణి, వాసవీ పాలిటెక్నిక్, తాడేపల్లిగూడెం



» వాలీబాల్ పోటీల్లో మేం రన్నరప్‌గా నిలిచాం. మా శాయశక్తులా ఆడాం. ఈ క్రీడలు మాలో పోటీ తత్వాన్ని పెంచాయి. కేవలం క్రీడల్లోనే కాకుండా చదువులోనూ మా కళాశాలతో పాటు ఇతర కళా శాలలతో పోటీ పడాలనే తపన పెరిగింది.

-ఆర్.జయశ్రీ, సీతాపాలిటెక్నిక్ , భీమవరం



» వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాం. ఎంతో ఆనందంగా ఉంది. ఇప్పటి వరకూ మా కళాశాలకు ఆడాం. ఇక మన జిల్లా పేరు కోసం ఆడతాం. ఆ ఆలోచనే ఎంతో ఆనందాన్నిస్తుంది. క్రీడలు మాలో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తాయి.

-ఎం.హరిత, సీఆర్ రెడ్డి ఏలూరు



పోటీల్లో పాల్గొన్న చిత్రకారులతో అంతర్జాతీయ చిత్రకారుడు మార్లపూడి ఉదయ్‌కుమార్

లైవ్ ఆర్ట్స్ వేసిన ఆర్టిస్టులకు బహుమతులు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ చిత్రకారుడు మార్లపూడి ఉదయ్ కుమార్ తన తండ్రి, డ్రాయింగ్ టీచర్, మార్లపూడి ఇజ్రాయేల్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు చిత్రకారులు తమ తమ చిత్రాలను లైవ్‌లో చిత్రీకరించారు. ఉదయ్ ఆర్ట్స్ అకాడమీ, ఫోరం ఫర్ ఆర్ట్స్ పాలకొల్లు ఎల్ఆర్‌పేట 5వ వీధిలో ఉదయ్‌కుమార్ నివాసం (శాంతి నివాసంలో) బుధవారం జరిగిన కార్యక్రమానికి ఉదయ్ కుమార్ అధ్యక్షత వహించారు. పోటీల్లో ప్రథమ బహుమతి కట్టా మహేష్ (భీమవరం) రూ.8 వేలు నగదు, ద్వితీయ బహుమతి ఎన్ఆర్ కుమార్ (మండపేట) రూ.4 వేలు, తృతీయ బహుమతి గుబ్బల పద్మాకర్ (భీమవరం) రూ.3 వేలు, మరో 9 మందికి కన్సొలేషన్ బహు మతులు రూ.1000 చొప్పున బహుమతులు, సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. పోటీల్లో పాల్గొని చిత్రాలను చిత్రీకరించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. నీల్‌కమల్ మూర్తి, తాళ్ళబాలు, రామబ్రహ్మం, కాసా కోటి వీరభద్రం, సాయికృష్ణ, ముత్యాల సుబ్బారావు పాల్గొన్నారు.







క్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల ప్రదర్శనలు

అత్తిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :అత్తిలి మదర్ మెర్సిల్లా స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో ఎన్.రమేష్, ఎంవీఎల్‌కే ప్రసాద్‌లు మాట్లాడుతూ విద్యార్థులు ప్రేమ, సహోదరభావం, సేవా భావం కలిగి ఉండాలని సందేశమిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. క్రిస్మస్ కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అత్తిలి పారిష్ ప్రీస్ట్ ఫాదర్ చైతన్యరాజు, కరస్పాండెంట్ సిస్టర్ జ్యోతి, ప్రిన్సిపాల్ సిస్టర్ ఫిలీకురియన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాడు నేడు





కాళ్ళ-కోలనపల్లి రహదారికి మోక్షం

ఎన్నో ఏళ్ళుగా సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు, వాహనదారులకు కష్టాలు తీరాయి. కాళ్ళ నుంచి కోలనపల్లి గ్రామానికి వెళ్ళే దారి పొడవునా పెద్ద పెద్ద గోతులు పడి నానా అవస్థలు పడేవారు. కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని సుమారు రూ.40 లక్షలతో కాళ్ళ-కోలనపల్లి రహదారి నిర్మాణ పనులను చేపట్టినట్లు ఏఈ శ్రీహరిరాజు తెలిపారు.



ఢిల్లీలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, శ్రీనివాస వర్మను కలిసిన రాష్ట్ర వైద్య శాఖా మంత్రి సత్యకుమార్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

క్రిటికల్ కేర్ ఆస్పత్రికి రూ.30 కోట్లు ఇవ్వండి

రాష్ట్ర వైద్య శాఖా మంత్రి సత్యకుమార్‌కు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ వినతి

భీమవరం టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భీమవరంలోని గొల్లవానితిప్ప రోడ్డులో 100 పడకల ఆసుపత్రి స్థలంలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి అవసరమైన రూ.30 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ రాష్ట్ర మంత్రి సత్య కుమార్‌ను కోరారు. ఢిల్లీలో బుధవారం కేంద్ర మంత్రులు శ్రీనివాసవర్మ, నితిన్ గడ్కరీతో మంత్రి సత్యకుమార్ భేటీ అయ్యారు. భీమవంల క్రిటికల్ కేర్ విభాగం సమస్యను వర్మ సత్యకుమార్‌కు వివరించారు. నూతన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భీమవరం జిల్లా కేంద్రంగా ఏర్పడిందన్నారు. జిల్లా ఆసుపత్రి లేదని, ప్రస్తుతం 50 పడకల ఆసుపత్రి 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారని వివరించారు. అత్యవసర కేసుల నిమిత్తం క్రిటికల్ కేర్ బ్లాక్ అవసరమని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలకు ప్రత్యేక విభాగం అవసరం ఉందన్నారు. గొల్ల వానితిప్ప రోడ్డులో ప్రస్తుతం కొనసాగుతున్న 100 పడకల కొత్త ఏరియా ఆసుపత్రి - భీమవరం స్థలంలో కొత్త 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను నిర్మించడానికి సరిపోతుందని వివరించారు. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన రూ. 30 కోట్లు మంజూరు చెయ్యాలని ఆయన కోరారు.

కోడేరు వారధికి నిధులు ఇవ్వండి

ఆచంట ఎమ్మెల్యే పితాని వినతి

పెనుమంట్ర: వశిష్ఠ గోదావరిపై పి.గన్నవరం - కోడేరు వారధి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కోరారు. ఢిల్లీలో బుధవారం కేంద్రమంత్రిని కలిసి వారధి డిజైన్, అవసరాన్ని వివరించారు. గోదావరి జిల్లాల నడుమ రాకపోకలు సులభతరం కావడంతో పాటు లంకలో పండించిన పంటను మార్కెట్‌కు తరలించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. గోదావరి వరద సమయంలో ప్రాణ నష్టం జరగకుండా నివారించవచ్చునని నితిన్ గడ్కరీకి పితాని సత్యనారాయణ వివరించారు. నితిన్ గడ్కరీ నిధులు మంజూరు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు పితాని సత్యనారాయణ తెలిపారు.

ఎంపీహెచ్‌ఏలను విధుల్లోకి తీసుకోండి

సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు.. ఉమ్మడి జిల్లాలో 111మందికి ఊరట

ఏలూరు అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నియామక ప్రక్రియలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో హైకోర్టు తీర్పుతో ఎంపీహెచ్‌ఏ(మేల్)ఉద్యోగులను కొందరిని విధుల నుంచి తొలగించారు. వారిని యథాతథంగా విధుల్లోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

కాంట్రాక్టు ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగుల సంఘం నాయకులు కృష్ణమూర్తి వివరాలను తెలియజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన నియామకాల్లో 2 రకాల జీవోలపై వివాదాలు తలెత్తడం, నియామకాలపైనా ఆరోపణలు, కోర్టు తలుపులను తట్టడం 2013నుంచీ జరుగుతూనే ఉంది. నియామకాలకు సంబంధించి ఒక జీవో అయిన 1207ను ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు ఇటీవల కొట్టివేసింది. సంబంధిత జీవో పరిధిలో నియమితులైన కాంట్రాక్టు ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగులందరినీ రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల డీఎంహెచ్‌వోలు కొద్దిరోజుల క్రితం టెర్మినేట్ చేసిన విషయం విదితమే. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 111 మంది ఎంపీహెచ్‌ఏ ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సంబంధిత ఉద్యోగులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారందరినీ 20 రోజుల్లో మళ్ళీ విధుల్లోకి తీసుకోవాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని సంఘ నాయకులు వివరించారు. సుప్రీంకోర్టులో తమ వ్యాజ్యంపై తుది తీర్పు వచ్చేవరకు మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయన్నారు. కోర్టు ఉత్తర్వుల అమలుపై ప్రభుత్వం నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశాలు అందాల్సి ఉంది.

పోలీస్ సిబ్బందికి గంట సేపు క్రీడలు

వాలీబాల్, నెట్ అందజేసిన ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజాక్షేత్రంలో ఉద్యోగ నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలని, రోజుకు ఒక గంట సేపు క్రీడలు కాని, వ్యాయామం కాని చేయాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. జిల్లాలోని ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లకు వాలీబాల్, నెట్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం అందించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు నిత్యం పని ఒత్తిడితో ఉంటున్నారని, రోజుకు ఒక గంటపాటు అయినా స్టేషన్ ఆవరణలోనే కచ్చితంగా వాలీబాల్ ఆడితీరాల్సిందేనని చెప్పారు. దీని వలన వారి ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా పెంపొందించుకుంటారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని ఈ నేపథ్యంలోనే అన్ని స్టేషన్ల సిబ్బంది కచ్చితంగా వారానికి కనీసం నాలుగు లేదా ఐదు రోజులు అయినా వాలీబాల్ ఆడాలని సూచించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్ సూర్య చంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శానం రమేష్‌బాబు పలువురు పాల్గొన్నారు.

కోర్టు భవనాల్లో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు



జిల్లా కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న అదనపు జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి రామకృష్ణ

ఏలూరు క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టు భవనంతో పాటు కోర్టు ఆవరణలో ఉన్న వివిధ కోర్టులు ఉన్నాయి. నిత్యం వందలాది మంది కక్షిదారులు వస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోర్టు ఆవరణలో అగ్ని ప్రమాద నివారణ చర్యలపై ఆ శాఖ అదనపు జిల్లా అధికారి రామకృష్ణ, సిబ్బంది బుధవారం కోర్టు బయట ప్రాంతాలను పరిశీలించారు. కోర్టు ఆవరణ, భవనం లోపల, విద్యుత్ స్తంభాలను, వైర్లను పరిశీలించారు. ఆవరణలోని చెట్లు కూడా పరిశీలించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఏవిధమైన ముందస్తు చర్యలు తీసుకోవాలో క్షుణ్ణంగా పరిశీలించారు. కోర్టులో విలువైన రికార్డులు ఉంటాయి. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా ప్రమాదాల నివారణకు, ఒక వేళ ప్రమాదం సంభవించినా ఏ విధమైన చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈమేరకు తగిన చర్యలు చేపట్టనున్నారు.

21న జడ్పీ సమావేశాలు

ఉదయం ప్రత్యేక సమావేశం

మధ్యాహ్నం సర్వసభ్య సమావేశం

ఏలూరుసిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయం ఈ నెల 21న వరస సమావేశాలు జరగనున్నాయి. జడ్పీటీసీ సభ్యుల అభ్యర్థన మేరకు ఈనెల 21న ఉదయం పత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఈవో ఆర్.విజయరాజు బుధవారం తెలిపారు. సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు. అదే రోజు మధ్యాహ్నం జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు తణుకులో జాతీయస్థాయి క్విజ్ పోటీలు

తణుకు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల నందు ఈ నెల 20న జాతీయ స్థాయి క్విజ్ పోటీలు జరగనున్నాయి. ప్రిన్సిపాల్ యు.లక్ష్మీ సుందరీ బాయి బుధవారం పోటీల వివరాలు తెలియజేశారు. గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయ శాస్త్రం, కంప్యూటర్స్, గణాంక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు జరుగుతాయన్నారు. కళాశాల విద్యార్థులు ఎవరైనా పోటీలో పాల్గొన వచ్చని తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు తమ వివరాలను 98481 87600 నెంబర్‌కు తెలియజేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ముసురు

అల్పపీడనం ప్రభావంతో మబ్బులు, వర్షాలు



ఏలూరు రూరల్ మండలంలో ధాన్యంపై బరకాలు కప్పుతున్న రైతులు

- రైతులలో ఆందోళన
- ఇంకా పూర్తికాని మాసూళ్లు
- కల్లాలు, రహదారిపై ధాన్యం
- కాపాడుకునేందుకు పాట్లు

ఏలూరు సిటీ / భీమవరం రూరల్ / ఆచంట / అత్తిలి / ఏలూరు రూరల్ / లింగపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల బుధవారం తేలికపాటి వర్షాలు పడ్డాయి. ముమ్మరంగా వరి కోతలు జరుగుతున్న తరుణంలో మబ్బులు, వర్షాలతో నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక చోట్ల ధాన్యం కల్లాలు, రోడ్లపై ఉంది. ధాన్యం తడవకుండా రైతులు బరకాలు కప్పి కాపాడుకుంటున్నారు. కొంత మంది ధాన్యాన్ని రాత్రి పగలు, తూకాలు తూసి మిల్లులకు పంపుతున్నారు.

ఏలూరు రూరల్ మండలంలో రైతులు ధాన్యం కాపాడుకునే ప్రయత్నం చేపట్టారు. మల్కాపురం, సుంకరవారితోట, చాటపర్రు, జాలిపూడి, కేడీ. పురం, పోణంగి, కాట్లంపూడి ప్రాంతాల్లో వరి సాగవుతోంది. ఇప్పటికి కేవలం 40శాతం మాత్రమే వరి కోతలు, మాసూళ్లు పూర్తయ్యాయి. కోత యంత్రాల ద్వారా మాసూళ్లు నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో రహదారుల వెంబడి, కల్లాలు, పంట పొలాల్లో ధాన్యాన్ని కొద్దిరోజులుగా ఆరబెడుతున్నారు. వాతావరణ మార్పులు రైతులను కలవరానికి గురి చేస్తున్నాయి. ఆరబెట్టిన ధాన్యం రాశులను బస్తాల్లో పట్టి ఎడ్ల బళ్లు, ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలిస్తున్నారు.

లింగపాలెం మండలంలో తేలికపాటి వర్షం కురవడంతో వరి రైతులు ఉరుకులు పరుగులతో బెంబేలెత్తిపోయారు. కల్లాలలో ధాన్యం కాపాడుకునేందుకు రైతులు నానాఅవస్థలు పడ్డారు. సుమారు దుక్కుకు పైగా వర్షం కురవడంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



ఆచంటలో ధాన్యం రాశులు పరిశీలిస్తున్న జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ ప్రసాద్

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్ట్యా రైతులందరూ త్వరితగతిన ధాన్యాన్ని మిల్లులకు తరలించుకోవాలని, తేమ శాతం అధికంగా ఉన్న కట్‌పార్ముల ద్వారా ధాన్యాన్ని రైతులు విక్రయించుకునే అవకాశం ఉందని పశ్చిమ గోదావరి జిల్లా పౌర సరఫరాల శాఖా మేనేజర్ టి.శివ రామ ప్రసాద్ సూచించారు. బుధవారం ఆచంటలో రైతులతో మాట్లాడారు. మబ్బులు, వర్షం నేపథ్యంలో రెండు రోజులు పాటు రైతులు కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏవో బి.నాగరాజు తదితరులున్నారు.

అల్పపీడన ప్రభావంతో రెండు రోజులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ కోరారు. ప్రస్తుతం కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రైతు సేవా కేంద్రంలో తేమ శాతంకి అనుగుణంగా అమ్ముకోవడానికి వీలు కల్పించినట్లు తెలిపారు. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దన్నారు.

మునిగిన నారుమడులు

అల్పపీడనం ప్రభావంతో రైతులు వాన గండం దాట లేకపోతున్నారు. సార్వా సీజన్ చివరిలో పంట దక్కించుకోడానికి దాళ్వా సీజన్‌లో సాగు ఆరంభానికి రైతులు అవస్థలు పడుతున్నారు. మారింది. భీమవరం రూరల్ మండల గ్రామాల్లో బుధవారం కురిసిన వర్షానికి వారం రోజులుగా వేసిన నారుమడులు నీట మునిగాయి. నీటిని బయటకు తోడే యత్నాలలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సార్వా పంట ఇంకా పది వేల ఎకరాల వరకు మాసూలు కావలసి ఉంది. పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళనలో ఉన్నారు. మరో రెండు రోజులపాటు వర్ష సూచనతో రైతన్నలలో భయం నెలకొంది.

చలితో గజ గజ..

ఏలూరు క్రైం: రోజురోజుకు వాతావరణంలోని ఉష్ణోగ్రత తగ్గడం, ప్రస్తుత అల్పపీడన ప్రభావంతో చలి తీవ్రత పెరుగుతుంది. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాలైన పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, టి.నరసాపురం మండలాలతో పాటు సమీప జంగారెడ్డిగూడెం మండలాల్లో చలి విపరీతంగా పెరిగింది. ఏజెన్సీ ప్రాంతంలో రాత్రి వేళ 10 డిగ్రీలు, మైదాన ప్రాంతంలో 13 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. పగటి వేళ 20 డిగ్రీలు ఉష్ణోగ్రత చూపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల వద్ద చలిమంటతో ఉపశమనం పొందుతున్నారు. రైతులు పొలాల్లో మంటలను వేసుకుంటూ రాత్రి వేళ పొగ తోటలకు నీళ్ళు కట్టడం చేస్తున్నారు. ధాన్యం రాశుల వద్ద రాత్రి వేళ కాపలా ఉంటున్నవారు కూడా చలి మంటతోనే జాగారం చేస్తున్నారు. వాతావరణశాఖ రెండు రోజుల పాటు ఒక మోస్తరు వర్ష సూచన చెప్పడంతో చెప్పడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే అధికారులు సూచించారు. బుధ, గురు, శుక్రవారాలు ఉష్ణోగ్రత 22 డిగ్రీలు ఉండవచ్చని, శని, ఆది, సోమవారాలు 17 డిగ్రీలు ఉండవచ్చునని వాతావరణశాఖ ప్రాథమికంగా తెలుపుతుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి



చలి తీవ్రతను బట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం మంచులో తిరగకూడదు. మాస్క్, మఫ్లర్ ధరించాలి. చెవుల నుంచి చలిగాలి వెళ్లడం వల్ల నాడులపై ప్రభావం ఉంటుంది. ఉన్ని వస్త్రాలు ధరించాలి. 60 ఏళ్ల పైబడిన వారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. బ్రాంకైటిస్, బ్రాంకైటిస్ ఆస్మా, శ్వాసకోస వ్యాధు లు వచ్చే ప్రమాదం ఉంది.

డాక్టర్ తోకల సికింద్రమోహన్,
ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఏలూరు

హర్షిత స్కూల్ ప్రిన్సిపాల్ అరెస్ట్?

కామవరపుకోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తడికలపూడి హర్షిత ఇంగ్లీషు స్కూలు ప్రిన్సిపాల్ నందిగం రాణి భర్త ధర్మరాజు, రాణి సోదరుడు సురేష్‌ను సీఐడీ అధికారులు బుధవారం తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో విచారించారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకున్నట్టు తెలియ వచ్చింది. నందిగం రాణిపై హైదరాబాద్ సైబర్ క్రైం కేసులో కొంతకాలం జైలులో ఉన్నారు. ఇటీవల సీఐడీ బృందం ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకోవడానికి రావడంతో ఆమె పాఠశాల పైఅంతస్తులో ఒక గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. చాలాసేపు వేచిఉన్న సీఐడీ బృందం ఆమెకు కిటికీ నుంచి నోటీసు అందజేసి వెళ్లిపోయారు. కాగా సీఐడీ విచారణ, అరెస్ట్‌పై తడికలపూడి పోలీసులను వివరణ కోరగా ధ్రువీకరించలేదు. స్కూలు వద్ద జరిగిన సంఘటనపై మాత్రం కేసు నమోదు చేసినట్టు తెలియజేశారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో విచారణ చేస్తున్న వైద్యులు

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో లంచాలపై విచారణ

ఏలూరు క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం కోసం చేరిన ఒక మహిళ బంధువుల నుంచి తల్లి బిడ్డల విభాగంలో కొంతమంది ఉద్యోగులు లంచం తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో ఆసుపత్రి అధికారులు బుధవారం విచారణ నిర్వహించారు. పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మహిళ ఈనెల 12న ఆస్పత్రిలో చేరింది. 13న ఆమె బంధువు సహాయంగా వచ్చారు. ఆసుపత్రిలో కొంతమంది ఉద్యోగులు లంచాలకోసం డిమాండ్ చేసి వసూలు చేశారని ఆమె వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపించారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో ఏలూరు అర్బన్ తహసీల్దార్ శేషగిరి అదే రోజు ప్రాథమిక విచారణ చేశారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు పూర్తిస్థాయి విచారణకు ఎంసీహెచ్ ఇన్‌చార్జి డాక్టర్ పి లావణ్య, డెర్మటాలజిస్ట్ త్యాగి, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మిలతో బృందం ఏర్పాటు చేశారు. వారు బుధవారం ఉద్యోగులు, ఫిర్యాదుదారు వాగ్మూలం నమోదు చేశారు. నివేదికను మెడికల్ సూపరింటెండెంట్‌కు అందిస్తారు. అనంతరం తహసీల్దార్ శేషగిరి ద్వారా జిల్లా కలెక్టర్‌కు అందనున్నట్లు సమాచారం.

పేకాట స్థావరంలో 19 మంది అరెస్టు

రూ. 21 వేల నగదు, 20 కాయిన్స్ స్వాధీనం

నరసాపురం రూరల్ / మొగల్తూరు 18 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు మండలం సీతారంపురం గ్రామ సెంటర్‌లో స్పోర్ట్స్ క్లబ్ ముసుగులో నిర్వహిస్తున్న జూదంపై పోలీసులు కొరడా ఝుళిపించారు. బుధవారం రాత్రి మెరుపు దాడిచేసి 19 మందిని అరెస్టు చేశారు. రూ.21,240 నగదు, 20 కాయిన్స్, పేక కట్టలు, ఒక టేబుల్, నాలుగు కుర్చీలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ జి.దుర్గా ప్రసాద్ చెప్పారు. జూదం వెనుక ఇద్దరు నాయకులు కీలకమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల పోలీసులు నరసాపురం మండలం నవరసపురంలో కోడి పందేలపై దాడి చేసి పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇది మరవక ముందే మొగల్తూరు సెంటర్‌లోని ఒక భవనంలో జూదం నిర్వహించడం, దానిపై పోలీసులు దాడి చేయడం సంచలనంగా మారింది.

41 ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టారు

- 639.75 కేజీల రాగి అపహరణ
- విలువ రూ.6.39 లక్షలు
- జిల్లాలో 16 కేసులు నమోదు
- ముఠా సభ్యులు ముగ్గురు అరెస్ట్



వివరాలు చెబుతున్న ఎస్పీ కిశోర్, పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న రాగి

ఏలూరు క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌పార్మర్లు సునాయాసంగా పగులగొట్టేస్తారు. అందులో రాగి వైరు తస్కరించడమే వారి లక్ష్యం. జిల్లాలో ఒకటి రెండు కాదు 41 ట్రాన్స్‌పార్మర్లు పగులగొట్టేశారు. 639.75 కేజీ రాగి వైరు అపహరించారు. వారిపై జిల్లా వ్యాప్తంగా 16 కేసులు నమోదు కాగా ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. రాగి వైరు అపహరించే ముగ్గురు ముఠా సభ్యులతో పాటు వాటిని కొనుగోలు చేసే మరొకరిని కూడా భీమడోలు సర్కిల్ పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్ వివరాలు తెలిపారు.

జిల్లాలోని పలు ప్రాంతాల్లో పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి వాటిలో రాగి వైరును అపహరిస్తున్నారు. ద్వారకాతిరుమల పరిధిలో ఈ ఏడాది 10 కేసులు, లక్కవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 2, టినరసాపురం పరిధిలో 1, తడికలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదు చేశారు. మొత్తం 41 ట్రాన్స్‌పార్మర్లను పగులగొట్టి 639.75 కేజీల రాగివైరును అపహరించారు. వీటి విలువ రూ.6,39,750 ఉంటుందని ఎస్పీ తెలిపారు.

ప్రత్యేక బృందం నిఘా

పొలాల్లో ట్రాన్స్‌పార్మర్‌ను పగులగొట్టి రాగి వైర్లు అపహరిస్తున్న సంఘటనలపై డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ టి సుధీర్, భీమడోలు హెడ్‌కానిస్టేబుల్ ఎస్ శ్రీనివాసరావు, ద్వారకాతిరుమల కానిస్టేబుళ్లు ఎం వెంకటేశ్వరరావు, ఎన్.మురళీకృష్ణ, హోంగార్డు విజె ప్రకాష్‌బాబు ఒక బృందంగా నిఘా ఉంచారు. ఈనెల 17న రాత్రి అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు వెళుతుండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన మానుకొండ వెంకట్రావు, అతని బావమరుదులు జంగారెడ్డిగూడేనికి చెందిన ముగ్గళ్ళ దుర్గా ప్రసాద్, ముగ్గళ్ళ శ్రీనివాసరావు కలిసి ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. దుర్గా ప్రసాద్, శ్రీనివాసరావుపై గతంలో గంజాయి కేసులు ఉన్నాయని గుర్తించారు. గంజాయికి బానిసలై అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించడానికి బావ వెంకట్రావుకు సహాయంగా వెళ్లి నేరాలకు పాల్పడ్డారన్నారు. ఈ ముగ్గురు ట్రాన్స్‌పార్మర్లు పగులగొట్టి తీసుకువచ్చిన రాగి వైరును జంగారెడ్డిగూడేనికి చెందిన పాత సామాన్ల వ్యాపారి ఉక్కుర్తి వెంకటేశ్వరరావు కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. దొంగ సొత్తు కొనుగోలు చేసిన నేరంపై వెంకటేశ్వరరావును కూడా అరెస్టు చేసినట్లు ఎస్పీ చెప్పారు.

రాగి వైర్లు కరిగించి..

రాగి వైర్లను కరగదీసి ఐదు కేజీల దిమ్మెలుగా చేశారు. మరి కొంత వైరు కరగదీయడానికి సిద్ధంగా ఉంచారు. వారి నుంచి 639.75 కేజీలు రాగి వైరును స్వాధీనం చేసుకున్నారు. ట్రాన్స్‌పార్మర్లు పగులగొడితే కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ కిశోర్ హెచ్చరించారు. నిరంతరం పోలీసు నిఘా పెడతామన్నారు. ఈ సందర్భంగా భీమడోలు సీఐ, ద్వారకాతిరుమల ఎస్ఐ, వారి సిబ్బందిని ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఏఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకా తిరుమల ఎస్ఐ సుధీర్‌లు పాల్గొన్నారు.



స్కూల్ వద్ద ఢీకొంటున్న ఆబోతులు

అమ్మో.. ఆబోతులు

పాఠశాల వద్ద మందలుగా సంచారం

అప్పుడప్పుడు వాటి మధ్య యుద్ధం

ఉపాధ్యాయులు, విద్యార్థుల భయాందోళన

ఆకివీడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల సమీపంలో మందలుగా ఆబోతుల సంచారం. అప్పుడు ఒకదానిని మరొకటి కొమ్ములతో పొడుచుకుంటూ భీకర యుద్ధానికి దిగుతాయి. ఆ సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చేష్టలుగి చూస్తుండి పోవాల్సిందే. స్థానికులు ఎవరూ అటువైపు రావడానికే సాహసించరు. పట్టణంలోని ఆరో వార్డులోని ఎంపీపీ (శివాలయం స్కూల్) పాఠశాల ఎదురుగా బుధవారం ఆబోతులు యుద్ధానికి దిగడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు భయపడి పోయారు. నగర పంచాయతీ పరిధిలో కొంతమంది పశువుల రైతులు వాటిని మేపలేక రోడ్లపైకి వదిలేస్తున్నారు. పట్టణంలో కలియ తిరుగుతూ రోడ్లపై తిష్ట వేయడంతో ట్రాఫిక్ నిలిచి పోతోంది. పట్టణంలోని భుజ బలరాయుడు చెరువు గట్టు, సిమెంట్ రోడ్లపై మందలు ఉంటున్నాయి. అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



చికెన్ దుకాణం వద్ద మినీ వ్యాన్, దెబ్బతిన్న బైక్‌లు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి..

చికెన్ షాపులోకి దూసుకెళ్లిన వ్యాన్

గణపవరం, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): వరదరాజపురం బుధవారం ఉదయం వేగంగా వెళుతున్న మినీ వ్యాన్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి చికెన్‌షాపులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో స్తంభం విరిగిపోయింది. చికెన్ దుకాణంలో వినియోగదారులు భయంతో పరుగులు తీశారు. దుకాణం వద్ద రెండు మోటార్ సైకిళ్లు దెబ్బతిన్నాయి. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న కారు, బైక్

ఒకరికి తీవ్ర గాయాలు

ద్వారకాతిరుమల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బైక్, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని వెంకటకృష్ణాపురంలో బుధవారం జరిగిన సంఘటన వివరాలు స్థానికులు తెలిపారు. గుండుగొలనుకుంటకు చెందిన అద్దంకి దుర్గా వరప్రసాద్ తన మోటార్‌సైకిల్‌పై వెంకట కృష్ణాపురం నుంచి ద్వారకాతిరుమలకు వెళుతున్నాడు. అదేసమయంలో వెంకటకృష్ణాపురానికి చెందిన యలమర్తి సురేష్ కారులో స్వగ్రామానికి వెళుతున్నాడు. వెంకట కృష్ణాపురం వద్ద కారు, మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో దుర్గావరప్రసాద్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు హుటాహుటిన పీహెచ్‌సీకి తరలించడంతో చికిత్స పొందుతున్నాడు. కారు సైతం పాక్షికంగా ధ్వసమైంది.



అఖిల భారత విశ్వవిద్యాలయ క్రీడా పోటీలకు శంకర్

ఏలూరు అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ యూనివర్శిటీలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించిన ఇంటర్ యూనివర్శిటీ రన్నింగ్ చాంపియన్‌షిప్‌లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సీహెచ్.శంకర్ 400 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ, 400 మీటర్ల పరుగులో రజత పతకాలను సాధించాడని ప్రిన్సిపాల్ గిరిబాబు తెలిపారు. ఈ విజయంతో ఈ నెల 2 నుంచి 30వ తేదీ వరకు భువనేశ్వర్‌లోని 'కిస్' వర్సిటీ క్రీడాప్రాంగణంలో జరుగనున్న అఖిలభారత విశ్వవిద్యాలయాల క్రీడాపోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించడానికి శంకర్ అర్హత సాధించాడని వివరించారు. విజేతను వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు అభినందించారు.

23న అథ్లెటిక్స్ పోటీలు

ఏలూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ పోటీలకు సంబంధించి జూనియర్, సీనియర్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 23న ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుళ్ళప్రసాదరావు, దేవరపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -16 నుంచి 20 ఏళ్ళలోపు పురుషులు, మహిళా విభాగాల్లో ఎంపికలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టినతేదీ ధ్రువ పత్రం, 10వ తరగతి మార్కులలిస్ట్ తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 5న తణుకులో జరిగే క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అదేరోజు ఏలూరు జిల్లా నిడ్జెమ్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు 14 నుంచి 16 ఏళ్ళలోపు వారికి ఎంపికలు నిర్వహిస్తామన్నారు. మరింత సమాచారానికి 62814 31202 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

దోసపాడు దళితులకు న్యాయం చేయాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దోసపాడు దళితులకు అర్హులైన అసైన్డ్‌దారులకు ఫ్యామిలీ సర్టిఫికెట్, మరణించిన వారికి మరణ ధ్రువీకరణ పత్రాలు వారి వారసులకు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద బుధవారం ఆందోళన నిర్వహించి, అనంతరం డీఆర్వో విశ్వేశ్వరరావుకు దోసపాడు భూపోరాట కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆనందరావు, డి.నాగేంద్ర, పోరాట నాయకులు రాజు, భూషణం, లక్ష్మి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలసిన జాన్‌వెస్లీ

ఏలూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీకి సంబంధించి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చాగంటిపాటి జాన్‌వెస్లీ తెలిపారు. బుధవారం కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి పశుపతికుమార్ పరాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాష్ట్రంలో పార్టీకి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఆయనతో చర్చించినట్లు తెలిపారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

పెదవేగి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విత్తనశుద్ధితో దిగుబడులు పెరుగుతాయని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి ఎస్కే. హబీబ్ బాషా అన్నారు. పెదవేగి మండలం బి.సింగవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించి రబీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. విత్తనపు మొక్కజొన్న సాగు చేసే రైతులు ఆయా సంస్థలతో తప్పనిసరిగా ఒప్పందం తీసుకోవాలని తెలిపారు. పట్టుపరిశ్రమశాఖ డీడీ వాణి మాట్లాడుతూ తమ శాఖ మల్బరీ సాగుకు పలు రాయితీలను అందిస్తోందన్నారు. వ్యవసాయశాఖ ఏలూరు ఏడీ వై.సుబ్బారావు, పెదవేగి మండల వ్యవసాయాధికారి ఎం.ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చక్రదేవరపల్లిలో మోండలీజ్ క్యాడ్‌బరీ, ఆప్రో స్వచ్ఛంద సంస్థల ఆర్థిక సాయంతో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను బుధవారం ఆ సంస్థ ప్రతినిధులతో పాటు టీడీపీ నాయకులు ప్రారంభించారు. గ్రామంలో ప్రజలకు మంచినీటి సదుపాయం కల్పించాలనే ఉద్దేశంతో మినరల్ వాటర్‌ప్లాంట్‌కు కావాల్సిన భవనం ఏర్పాటుచేసినట్లు సర్పంచ్ సాయిల సత్యనారాయణ తెలిపారు. సంస్థల ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భవానీ భక్తులకు అన్నసమారాధన

ఉంగుటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం జాతీయ రహదారి పక్కన ఉన్న దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 20వ తేదీ నుంచి విజయవాడ చండీయాగానికి వెళ్లే భవానీ లకు అల్పాహారం, అన్న సమారాధన నిర్వహిం చనున్నట్లు స్థానిక సూర్నీడి సేవా సంస్థ నిర్వాహ కుడు శ్రీనివాసరావు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 20 నుంచి 22 వరకు వితరణ ఉంటుందన్నారు.

క్రీస్తు జననం లోకానికి వెలుగు

పెదవేగి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు జననంతో లోకానికి వెలుగు వచ్చిందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగిలో మంగళవారం రాత్రి నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి)తో కలిసి పాల్గొన్న చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ క్రీస్తు జననంతో లోకానికి రక్షణ వచ్చిందన్నారు. ఫాదర్ పి.బాల, ఫాదర్ ఏలీషా రాజు, పాస్టర్లు జ్యోతిరాజు, జాన్ వెస్లే, చొప్పెల్లి నాగరాజు, భారీగా విశ్వాసులు హాజరయ్యారు.



ఎంఎం పురం సందుల్లో ఉన్న కుక్కల గుంపు

కుక్కలు ఇలా ఉంటే దడ పుట్టదా..

బెడద తొలగించాలని గ్రామస్థుల వేడుకోలు

భీమడోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ, ఎంఎంపురం తదితర గ్రామాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్లపై చేరి గ్రామస్తులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. రాత్రి సమయంలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్ళేందుకు ఇబ్బంది పడుతున్నారు. పలు గ్రామాల్లో కుక్కల దాడితో చిన్న పిల్లలు గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఈ కుక్కల బెడదను అరికట్టే నాథుడే లేడా అంటూ ప్రజలు వాపోతున్నారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డీటీ, వీఆర్‌ఓలను ఉద్యోగం నుంచి తొలగించాలని ధర్నా

బుట్టాయగూడెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్ని హక్కులున్న ఆదివాసీ భూములకు అధికారులు కాసులకు కక్కుర్తిపడి గిరిజనేతరుల పేరున నకిలీ పాస్ పుస్తకాలు తయారుచేస్తూ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న జీలుగుమిల్లి మండలం డిప్యూటీ తహసీల్దార్ సందీప్ గౌడ్, తప్పుడు మ్యూటేషన్ చేసిన వీఆర్‌ఓ బుల్లాబ్బాయిని ఉద్యోగాల నుంచి తొలగించాలని కోరుతూ బుధవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నాయకులు, గిరిజనులు ఐటీడీఏ వద్ద ధర్నా నిర్వహించి ఏపీవో పీవీఎస్ నాయుడికి వినతిపత్రం అందజేశారు. ఏఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు పొట్ట కామరాజు, పండు నాగేంద్ర, రవ్వ బసవరాజు తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రికి శుభాకాంక్షలు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు బుధవారం ఢిల్లీలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపినట్టు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు తెలిపారు. కాగా ఆయనను టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోస్న గణేష్ అభినందించారు.



సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి : గన్ని

భీమడోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సద్వినియోగపర్చుకోవాలని ఏలూరు టీడీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు సూచించారు. భీమడోలు గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ప్రజలు వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సత్వర పరిష్కారాలను చూపించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో పద్మావతిదేవి తదితరులు పాల్గొన్నారు.

దళితసేన నూతన కార్యవర్గం

లింగపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళితసేన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ తెలిపారు. లింగపాలెంలో ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. స్టాలిన్ ఆధ్వర్యంలో జరిగిన దళితసేన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ నియోజకవర్గ అధ్యక్షురాలిగా మోనూరి దేవమాత, పట్టణ అధ్యక్షుడిగా కార్తీక్, మండల ఇన్‌చార్జ్ గా పి. ఉదయబాను, బీసీ సెల్ మండల అధ్యక్షుడుగా కొప్పుల నాగేందర్, సింగగూడెం అధ్యక్షుడిగా సీహెచ్. రవీంద్ర, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పంతం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా మన్మథరావు, గోపిని నియమించి నియామక పత్రాలను అందజేసినట్టు తెలిపారు.

ఉపాధ్యాయుల నిరసన

పెదపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్ విధానాన్ని సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని పెదపాడు జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు బుధవారం ప్లకార్డులు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, డీపీఆర్‌టీ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ భారంపై నిరసనలు



జంగారెడ్డిగూడెం సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం నాయకుల నిరసన

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని అదాని విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పంగిడిగూడెం రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం నిరసన తెలిపింది. పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ట్రూఅప్ చార్జీలు తగ్గించాలని, నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లులను దహనం చేశారు.

కుక్కునూరు: రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని నాణ్యమైన విద్యుత్ అందిస్తా మని హామీ ఇచ్చారని అన్నారు. కానీ ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచటం అన్యాయం అన్నారు. అలాగే స్మార్ట్ మిటర్లు బిగించే ఆలోచన విరమించాలని డిమాండ్ చేశారు. కుక్కునూరు మండలంలో లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొయ్యన శ్రీను, వై.నాగేంద్ర రావు, వై.సాయి కిరణ్, రమేష్, లక్ష్యయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెదపాడు: పెంచిన విద్యుత్తు చార్జీలు, ట్రూ అప్ ఛార్జీలను తక్షణం తగ్గించాలన, స్మార్ట్‌మీటర్లు బిగింపు ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పెదపాడు బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్తు బిల్లుల దహనం బుధవారం జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరిట వేలకోట్ల రూపాయలు ప్రజలపై భారం వేయడం తగదన్నారు.

పోలవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేయాలని స్మార్ట్ మీటర్ల బిగిపు నిర్ణయాన్ని విరమించాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం ఆ పార్టీ మండల కార్యదర్శి కారం భాస్కర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు.

టి.నరసాపురం: అదానితో ఒప్పందాలన్నీ రద్దు చేయాలని, అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఎఎస్‌ఆర్ నగర్ మూడురోడ్ల సెంటర్‌లో అదానీ దిష్టిబొమ్మ దహనం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గుడెల్లి వెంకటరావు, రైతుసంఘం మండల కార్యదర్శి అనుమోలు మురళీ, ఐద్వా నాయకురాలు కుమారి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల భూములకు పాస్ పుస్తకాలివ్వాలి



బుట్టాయగూడెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎత్తిపోతల పథకంలో ముంపునకు గురైన బొత్తప్పగూడెం నిర్వాసిత గిరిజనుల భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలను మంజూరు చేయాలని కోరుతూ ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం కెఆర్ పురం ఐటీడీఏ వద్ద నిర్వాసితులు ధర్నా చేశారు. జిల్లా కమిటీ సభ్యుడు కారం రాఘవ మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలం బొత్తప్పగూడెం మరో రెండు గ్రామాలకు చెందిన వ్యవసాయ భూములు చింతలపూడి ఎత్తిపోతల పథకంలో మునిగిపోగా వారికి కామయ్యపాలెంలో గిరిజనేతరులు ఆర్ అండ్ ఆర్‌లో అమ్ముకున్న భూములను అప్పటి పీవో షాన్ మోహన్ 2015లో నిర్వాసితులకు వ్యవసాయం చేసుకోమని చెప్పారన్నారు. భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేస్తామని కూడా అన్నారని 9 సంవత్సరాలు దాటుతున్నా పాస్‌పుస్తకాలు మంజూరు కాలేదన్నారు. భూముల్లో బొత్తప్పగూడెం నిర్వాసితులు వ్యవసాయాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్ అండ్ ఆర్‌లో భూములు అమ్ము కుని ప్రభుత్వం నుంచి డబ్బులు తీసుకున్న గిరిజనేతర రైతులు భూములు తమవని నిర్వాసితులపై దాడులకు దిగుతున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఎ చైర్మన్ దీనిపై సమగ్ర విచారణ జరిపి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన గిరిజన నిర్వాసితులకు న్యాయం చేయాలని, పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీవోకు వినతిపత్రం అందజేశారు.

ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం



పెదపాడులో సర్వసభ్య సమావేశం

పెదపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటు న్నట్లుగా ఎంపీడీవో అమీలుజమ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన బుధవారం జరిగింది. శాఖల వారీగా మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, వినియోగించిన నిధులు, ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. చేపట్టిన రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణం, వాటి ప్రగతిని వివరించారు. పలువురు సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. లావేటి శ్రీనివాసరావు, పొట్లూరి యుగంధర్, రంభా నాగరాజు, ఎంపీడీవో కార్యాలయ ఏవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి: చంటి



ఏలూరు టూ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకుని ప్రజలు లబ్ధిపొందాలని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బడేటి శ్రీహరిరావు మెమోరియల్ ట్రస్ట్ పేరిట మెగా ఉచిత వైద్యశిబిరం గజ్జలవారి చెరువు వద్ద నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడుతూ లక్షలాది రూపాయల వ్యయంతో ఉచితవైద్య శిబిరం నిర్వహించిన అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. కామినేని హాస్పిటల్స్ విజయవాడ వైద్యబృందం వైద్య పరీక్షలు నిర్వహించింది. భారీగా హాజరైన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండెకు సంబంధించి ఈసీజీ, 2డీ ఏకో పరీక్షలు నిర్వహించారు. కోఆప్షన్‌సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు తదితరులు పాల్గొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో డాక్టర్ కేర్ హోమియోపతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బడేటి చంటి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, చోడే వెంకటరత్నం పాల్గొన్నారు. నగర కమిషనర్ ఏ.భానుప్రతాప్, అడిషనల్ కమిషనర్ చంద్రయ్య పాల్గొన్న ఉచిత వైద్యశిబిరంలో నగర పాలక సంస్థ ఉద్యోగులంతా వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా హోమియోపతి మందులు పంపిణీ చేశారు.

బ్రోచర్ ఆవిష్కరణ

దివంగత మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే బడేటి కోట రామారావు (బుజ్జి) కాంస్య విగ్రహ సంస్మరణ సభ బ్రోచర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే బడేటి చంటి బ్రోచర్‌ను ప్రారంభించారు. ఈ నెల 26వ తేదీన జడ్పీ కార్యాలయం వద్ద బడేటి బుజ్జి కాంస్యవిగ్రహ ఆవిష్కరణ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చంటి తెలిపారు.

రిటైర్డ్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరిస్తాం

ఏలూరు అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాలలో రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు యూనిట్ సమావేశం జరిగింది. ఖజానా శాఖ అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ జి.సత్యనారాయణ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను తెలియజేస్తే ట్రెజరీ ద్వారా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రామరాజు మాట్లాడుతూ రిటైర్డ్ అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. విశిష్ట సేవలందించిన రిటైర్డ్ లెక్చరర్లు సంపదరావు, రాజారాం, వెంకటేశ్వరరావు, రాణి, రమాసరస్వతిలను సత్కరించారు. తొలుత నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్‌ను కట్‌చేసారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలు పరిష్కరిస్తాం



రైతు సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ నజీముల్లాషా

లింగపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించి వారికి న్యాయం చేస్తామని తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. రంగాపురంలో రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూసమస్యల పరిష్కార వేదికగా రైతుసదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రంగాపురంలో భూ సమస్యలపై 16 అర్జీలు వచ్చాయని, వాటిలో 6 సమస్యలను వెంటనే పరిష్క రించామన్నారు. మండలంలో ఇప్పటి వరకు భూసమస్యలపై 50 మంది రైతుల నుంచి అర్జీలు అందాయని వాటిలో 20 పరిష్క రించామన్నారు. సర్పంచ్ ముసు నూరి రాము, రెవెన్యూ సిబ్బంది, పలువురు రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెదపాడు: రెవెన్యూ గ్రామసభల ద్వారా అందిన సమస్యల సత్వర పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లుగా తహసీల్దారు ఎ.కృష్ణజ్యోతి తెలిపారు. వీరమ్మకుంట గ్రామ రెవెన్యూసదస్సులో పాల్గొని పలు భూ-సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ముప్పర్రు డీసీ అధ్యక్షుడు అప్పారావు, మరడాని రవి, వీఆర్వోలు నరసింహా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో అన్ని స్మశాన భూములు, మెయిన్ రోడ్డు ఇరుపక్కలా ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని తొలగించడానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రమద్వర పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ చింతలపూడి సదస్సులో అనేక మంది ఈ ఆక్రమణలపై ఫిర్యాదు చేశారని, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులో 31 సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. మండలంలో ఇప్పటివరకు జరిగిన సదస్సులలో 151 ఫిర్యాదులు రాగా 61 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. మాజీ సర్పంచ్ సీహెచ్.ధర్మరాజు, కొత్తపూడి శేషగిరిరావు, టి.నాగ విజయకుమార్, వీఆర్వోలు, స్థానికులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు పరిధిలోని 33/11కెవి పూళ్ళ సబ్ స్టేషన్ పరిధిలో చెట్టునరికే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. దుద్దేపూడి, పూళ్ళ, కురేళ్ళగూడెం, ఎంఎంపురం, ఇండస్ట్రీయల్ ఫీడర్లకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యాయామ కళాశాల అభివృద్ధి కమిటీ ఎంపిక

దెందులూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోపన్నపాలెంలోని శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాల అభివృద్ధి కమిటీని ఎంపిక చేసినట్టు గోపన్నపాలెం మాజీ సర్పంచ్, టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు) అన్నారు. బుధవారం వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నతానియేల్ ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీని ఎంపిక చేశారు. చైర్మన్‌గా పూజారి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా కొండేటి హనుమంతు, కార్యదర్శిగా ముప్పాళ్ల గోపాలకృష్ణ, జాయింట్ సెక్రటరీగా ఏనుగు అచ్చారావు, సభ్యులుగా ఏనుగు కేబుల్ శ్రీను, సింహాద్రి సతీష్, బజారు గణేష్‌ను ఎంపిక చేశారు.



ఎమ్మెల్యేకు బాలుడి కృతజ్ఞత

పెదవేగి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : వసతి గృహంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఐదునెలల చికిత్స అనంతరం కోలుకున్న బాలుడు ఆస్పత్రినుంచి ఇంటికి వెళ్ళకుండా ఆపద సమయంలో తనకు సాయం చేసిన వ్యక్తికి కృతజ్ఞతలు చెప్పడానికి నేరుగా ఆయన ఇంటికే వెళ్ళాడు. ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామానికి చెందిన మోరు రమేష్ కుమారుడు సుధీర్‌పాల్ ఏలూరు సెయింట్ గ్జేవియర్ పాఠశాలలో చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ ఏడాది జూలై నెలలో హాస్టల్‌లో తోటి విద్యార్థి కారణంగా పెట్రోల్ మీద పడి, తీవ్రంగా గాయపడ్డాడు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆ బాలుడ్ని విజయవాడలో ఆస్పత్రిలో చేర్పించి, మెరుగైన చికిత్సకు చర్యలు తీసుకున్నారు. ఐదు నెలల చికిత్స అనంతరం కోలుకున్న బాలుడు సుధీర్‌పాల్ బుధవారం విజయవాడ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి, ఇంటికి వెళ్ళే క్రమంలో నేరుగా దుగ్గిరాల వెళ్ళి ఎమ్మెల్యే ప్రభాకర్‌ను కలిసి, కృతజ్ఞతలు చెప్పాడు.

బాధితులకు ట్రైకార్ చైర్మన్ చేయూత

పోలవరం డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చేగొండపల్లి పునారావాస గ్రామంలో ఇటీవల షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్ళు దగ్ధమై నిరాశ్రయులైన మూడు కుటుంబాలకు బుధవారం ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆర్థిక సహాయం అందించారు. షార్ట్ సర్క్యూట్ వలన మూడు ఇళ్ళు దగ్ధమై సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుం బాలను బొరగం శ్రీనివాసులు పరామర్శించి వారికి కూటమి పాలన అండగా ఉంటుందని ప్రభుత్వం నుండి సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రగడపల్లి సర్పంచ్ కలుం బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

కోఆర్డినేటర్ రంగయ్యకు సత్కారం

ఏలూరు అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ మండలి(ఎస్సీఈఆర్టీ) సైకాలజీ విభాగం కో-ఆర్డినేటర్‌గా నియమితులైన ఏలూరు అర్బన్, రూరల్ మండలాల విద్యాధికారి(ఎంఈవో-2) ఆర్.రంగయ్య బదిలీపై వెళుతున్న సందర్భంగా బుధవారం రాత్రి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సత్కరించారు. జేఏసీ నాయకులు బి.రాము, టి.ప్రకాష్, జె.రాజారావు తదితరులు మాట్లాడుతూ మండల విద్యాధికారిగా మూడేళ్ళకుపైగా సేవలందించిన రంగయ్య ఉపాధ్యాయులపట్ల స్నేహితునిగా వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను నూరుశాతం అమలులో ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకోవడమే ఆయన పనితీరుకు అద్దంపడుతుందన్నారు. రంగయ్య మాట్లాడుతూ జిల్లాలో పనిచేసిన కాలంలో చేపట్టిన కార్యక్రమాల విజయవంతానికి ఉపాధ్యాయుల సహకారమే కారణమన్నారు. ఎన్టీయే, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, వైఎస్సార్ టీఎఫ్ సంఘాల నాయ కులు వెంకటేశ్వరరావు, జోసెఫ్, రామారావు, బాలాజీ, సూర్యప్రకాశరావు, సాయి శ్రీనివాసరావు, సాదర్‌నాయక్ పాల్గొన్నారు.

గుండె సమస్యల్ని నిర్లక్ష్యం చేయవద్దు

లింగపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధ వ్యాధులు, కిడ్నీ సమస్యలు ఉన్నవారు నిర్లక్ష్యం వహించకుండా డాక్టరును సంప్రదించి తగిన మందులను వాడాలని కే గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. కె. గోకవరంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం

కుక్కునూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఖమ్మం ఎన్‌జీఓ సంస్థ తలసేమియా బాధిత చిన్నారుల కోసం ఉచిత సేవలందిస్తున్న నేపథ్యంలో బుధవారం కుక్కునూరులో లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 40 మంది రక్తాన్ని అందించారు. మారేడుబాకకు చెందిన వీఆర్వో 17వ సారి రక్తదానం చేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని నిర్వాహకులు తెలిపారు. అలాగే టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు తలసేమియా చిన్నారుల కోసం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయికిరణ్, యూనియన్ కార్యదర్శి వలి బాషా, సీపీఎం మండల కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు

ఏలూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి తప్పనిసరిగా ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని, డిఎల్‌డివో పి.వి లక్ష్మి సూచించారు. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ సౌజన్యంతో ఏపీఎస్ఐఆర్డీ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు ఏలూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ బుధవారం ముగిసింది. ఈవోపీ ఆర్డీ బాషా, ఏపీఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంగపతి బోదెకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి

పోలవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తపట్టిసీమ పంచాయతీలోని మంగపతి బోదె సప్లయి కాలువ మరమ్మతులు శాశ్వత ప్రాతిపదికన చేయాలని కొత్తపట్టిసీమ గ్రామ రైతులు కోరారు. ఈ ఏడాది కొవ్వాడ కాలువ వరదల వల్ల బోదె ఆలింకకు గండ్లు పడ్డాయని వాటి మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని అయితే తాత్కాలిక మరమ్మతులు కాక ఆ నిధులతో శాశ్వత ప్రాతిపదికన కాంక్రీట్ గట్టు లేదా ప్రత్యామ్నాయ నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపామని మంజూరు కాగానే నిర్మాణం చేస్తామని ఏఈఈ టి. సురేష్ వివరించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడును విజయవాడలో మర్యాద పూర్వకంగా కలసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందచేశారు. అలాగే ఆర్టీసీ జైబీమ్ అసోసియేషన్‌ను రెడ్డిఅప్పలనాయుడుకు పరిచయం చేశారు. ఆయనను కలిసిన వారిలో ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణ, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లా నాయకులు ఉన్నారు.

సంకటహర చతుర్థి పూజలు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో విఘ్నేశ్వరస్వామి ఆలయాల వద్ద బుధవారం సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని గరికతో అర్చించి బెల్లం నివేదన చేశారు. సత్రంపాడులోని లక్ష్మీగణపతిస్వామి ఆలయం వద్ద ఆలయ అర్చకుడు రాఘవేంద్రశర్మ భక్తులతో సామూహిక పూజలు చేయించగా ఆలయ ఈవో చిననాగేశ్వరరావు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జీలుగుమిల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వరి, వేరుశనగ రైతులు ప్రస్తుత వాతవరణ పరిస్థితుల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఏవో కె.గంగాధరం అన్నారు. బర్రింకల పాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతు చిలక నాగేశ్వరావు పొలంలో మిర్చి పంటను పరిశీలించారు. ఆకుము డత రాకుండా చేపట్టాల్సిన చర్యల్ని వివరించారు.





270 కేజీల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో దయాసాగర్..సాధించిన మెడల్స్..

పట్టుపడితే.. పతకమే

వెయిట్ లిఫ్టింగ్‌లో దయా సాగర్ ప్రతిభ

ముదినేపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తన స్నేహితుడి మెడలో గోల్డ్ మెడల్‌ను చూసిన స్ఫూర్తితో తాను కూడా ఆ స్థాయికి ఎదగాలన్న పట్టుదల ఓ యువకుడిని జాతీయ స్థాయి క్రీడాకారుడిని చేసింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆ యువకుడు వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందాడు. పతకాల వీరుడిగా ఘనత సాధించాడు. ముదినేపల్లి మండలం పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెం గ్రామానికి చెందిన పక్కిరి దయాసాగర్ మచిలీపట్నం నోబుల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సమయంలో వ్యాయామ విద్యపై మక్కు కలిగింది. ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుండగా, తన స్నేహితుడు వెయిట్ లిఫ్టింగ్‌లో ఛాంపియన్ షిప్ సాధించడం చూసి తాను కూడ ఆ రంగంలో ప్రతిభ కనబర్చాలని నిర్ణయించుకున్నాడు. 2016లో స్వయంగా వెయిట్ లిఫ్టింగ్ నేర్చుకోవటం ప్రారంభించి, 2018 నాటికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానాలు సాధించాడు. జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన అనంతరం ఏలూరులో కోచ్ బడేటి వెంకట్రామయ్య వద్ద వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందాడు.2022 వరకు కేరళ, బీహార్, నాగపూర్, చెన్నై, చండీగడ్, నోయిడాలో జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి బంగారు, రజిత పతకాలను సొంతం చేసుకున్నాడు.

పతకాల వీరుడు

దయాసాగర్ రాష్ట్రస్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 22 పతకాలు, జాతీయ స్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించాడు. తొలుత 100 కేజీలు, 150 కేజీల బరువులను సునాయాసంగా లేప గలిగిన దయాసాగర్ గిరిష్టంగా జాతీయ స్థాయిలో 270 కేజీల బరువును లేపి తన ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాడు.

ప్రోత్సహిస్తే కోచింగ్ ఇస్తా : దయాసాగర్

వెయిట్ లిఫ్టింగ్ మంచి వ్యాయామ విద్య. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ప్రోత్సాహం లభిస్తే ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల యువతీ, యువకులకు వెయిట్ లిఫ్టింగ్‌లో కోచింగ్ ఇస్తా.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు దొరికారు

- 639.75 కేజీల రాగి అపహరణ
- విలువ రూ.6.39 లక్షలు
- జిల్లాలో 16 కేసులు నమోదు
- ముఠా సభ్యులు ముగ్గురు అరెస్ట్



వివరాలు చెబుతున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్లు సునా యాసంగా పగుల గొట్టేస్తారు. అందులో రాగి వైరు తస్కరించడమే వారి లక్ష్యం. జిల్లాలో ఒకటి రెండు కాదు 41 ట్రాన్స్ ఫార్మర్లు పగులగొట్టేశారు. 639.75 కేజీ రాగి వైరు అపహరించారు. వారిపై జిల్లా వ్యాప్తంగా 16 కేసులు నమోదు కాగా ఎట్టకేలకు పోలీసు లకు చిక్కారు. రాగి వైరు అపహరించే ముగ్గురు ముఠా సభ్యులతో పాటు వాటిని కొనుగోలు చేసే మరొకరిని కూడా భీమడోలు సర్కిల్ పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావే శంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్ వివరాలు తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పొలాల్లోని ట్రాన్స్ ఫార్మర్లను పగులగొట్టి వాటిలో రాగి వైరును అపహరిస్తున్నారు. ద్వారకాతిరుమల పరిధిలో ఈ ఏడాది 10 కేసులు, లక్కవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 2, టి.నరసాపురం పరిధిలో 1, తడికల పూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదు చేశారు. మొత్తం 41 ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి 639.75 కేజీల రాగివైరును అపహరించారు. వీటి విలువ రూ.6,39,750 ఉంటుందని ఎస్పీ తెలిపారు. పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి వైర్లు అపహరిస్తున్న సంఘటనలపై డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ టి సుధీర్, భీమడోలు హెడ్‌కానిస్టేబుల్ ఎస్ శ్రీనివాస రావు, ద్వారకాతిరుమల కానిస్టేబుళ్లు ఎం వెంకటేశ్వరరావు, ఎన్.మురళీకృష్ణ, హోంగార్డు విజ ప్రకాష్‌బాబు ఒక బృందంగా నిఘా ఉంచారు. ఈనెల 17న రాత్రి అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు వెళుతుండడంతో పోలీసులు అదుపు లోకి తీసుకుని విచారించారు. ద్వారకా తిరుమల మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన మాను కొండ వెంకట్రావు, అతని బావమరుదులు జంగారెడ్డిగూడేనికి చెందిన ముగ్గళ్ళ దుర్గా ప్రసా ద్, ముగ్గళ్ళ శ్రీనివాసరావు కలిసి ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. దుర్గా ప్రసాద్, శ్రీనివాసరావుపై గతంలో గంజాయి కేసులు ఉన్నాయని గుర్తించారు. గంజాయికి బానిసలై అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించడానికి బావ వెంకట్రావుకు సహాయంగా వెళ్లి నేరాలకు పాల్పడ్డారన్నారు. ఈ ముగ్గురు ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి తీసుకువచ్చిన రాగి వైరును జంగా రెడ్డిగూడేనికి చెందిన పాత సామాన్ల వ్యాపారి ఉక్కుర్తి వెంకటేశ్వరరావు కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. దొంగ సొత్తు కొనుగోలు చేసిన నేరంపై వెంకటేశ్వరరావును కూడా అరెస్టు చేసినట్లు ఎస్పీ చెప్పారు.

రాగి వైర్లు కరిగించి..

రాగి వైర్లను కరగదీసి ఐదు కేజీల దిమ్మెలుగా చేశారు. మరి కొంత వైరు కరగదీయడానికి సిద్ధంగా ఉంచారు. వారి నుంచి 639.75 కేజీలు రాగి వైరును స్వాధీనం చేసుకు న్నారు. ట్రాన్స్ ఫార్మర్లు పగులగొడితే కఠిన చర్యలు తీసుకుంటా మని, పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ కిశోర్ హెచ్చరించారు. నిరంతరం పోలీసు నిఘా పెడతామన్నారు. ఈ సందర్భంగా భీమడోలు సీఐ, ద్వారకాతిరుమల ఎస్ఐ, వారి సిబ్బందిని ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఏఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకా తిరుమల ఎస్ఐ సుధీర్‌లు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి గంట సేపు క్రీడలు

వాలీబాల్, నెట్ అందజేసిన ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజాక్షేత్రంలో ఉద్యోగ నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలని, రోజుకు ఒక గంట సేపు క్రీడలు కాని, వ్యాయామం కాని చేయాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. జిల్లాలోని ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లకు వాలీబాల్, నెట్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం అందించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు నిత్యం పని ఒత్తిడితో ఉంటున్నారని, రోజుకు ఒక గంటపాటు అయినా స్టేషన్ ఆవరణలోనే కచ్చితంగా వాలీబాల్ ఆడితీరాల్సిందేనని చెప్పారు. దీని వలన వారి ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా పెంపొందించుకుంటారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని ఈ నేపథ్యంలోనే అన్ని స్టేషన్ల సిబ్బంది కచ్చితంగా వారానికి కనీసం నాలుగు లేదా ఐదు రోజులు అయినా వాలీబాల్ ఆడాలని సూచించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్ సూర్య చంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శానం రమేష్‌బాబు పలువురు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో విచారణ చేస్తున్న వైద్యులు

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో లంచాలపై విచారణ

ఏలూరు క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం కోసం చేరిన ఒక మహిళ బంధువుల నుంచి తల్లి బిడ్డల విభాగంలో కొంతమంది ఉద్యోగులు లంచం తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో ఆసుపత్రి అధికారులు బుధవారం విచారణ నిర్వహించారు. పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మహిళ ఈనెల 12న ఆస్పత్రిలో చేరింది. 13న ఆమె బంధువు సహాయంగా వచ్చారు. ఆసుపత్రిలో కొంతమంది ఉద్యోగులు లంచాలకోసం డిమాండ్ చేసి వసూలు చేశారని ఆమె వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపించారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో ఏలూరు అర్బన్ తహసీల్దార్ శేషగిరి అదే రోజు ప్రాథమిక విచారణ చేశారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు పూర్తిస్థాయి విచారణకు ఎంసీహెచ్ ఇన్‌చార్జి డాక్టర్ పి లావణ్య, డెర్మటాలజిస్ట్ త్యాగి, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మిలతో బృందం ఏర్పాటు చేశారు. వారు బుధవారం ఉద్యోగులు, ఫిర్యాదు దారు వాగ్మూలం నమోదు చేశారు. నివేదికను మెడికల్ సూపరింటెండెంట్‌కు అందిస్తారు. అనంతరం తహసీల్దార్ శేషగిరి ద్వారా జిల్లా కలెక్టర్‌కు అందనున్నట్లు సమాచారం.



అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ముగిసిన షష్టి కల్యాణోత్సవాలు

ముదినేపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో గత 13 రోజులుగా జరుగుతున్న వార్షిక షష్టి కల్యాణోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజున మహా అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, శాసన మండలి మాజీ సభ్యుడు కమ్మిలి విఠల్ రావు పూజలు జరిపి ఈ సమారాధనను ప్రారంభించారు. 40 వేల మంది భక్తులు స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులు పుట్టలో పాలు పోసి చివరి రోజున సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకున్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం ఏసీ చందన, సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, నీలం శివ రమేష్, పరసా కృష్ణ, బెజవాడ రాధాకృష్ణ, పరసా రమేష్, వెనిగళ్ల సురేష్ అన్నసమారాధనను పర్యవేక్షించారు. అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, ఆలయంలో పూజలు నిర్వహించగా, పుట్ట వద్ద రుద్రపాక బాలగంగాధర తిలక్ పూజలు జరిపారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, తెలుగు దేశం, జనసేన నాయకులు చలసాని జగన్మోహనరావు, వీరంకి వెంకటేశ్వరరావు, ఎ.ఎన్?బాబు, నల్లగోపుల చలపతి తదితరులు పాల్గొని పూజలు జరిపారు. సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్ఐలు వీరభద్ర రావు, వెంకట్ కుమార్ బందోబస్తు నిర్వహించారు. గురజ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరుణి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

షష్టికి సహకారం అభినందనీయం

దేవస్థానంలో ఈనెల 6 నుంచి 18 వరకు షష్టి కల్యాణోత్సవాలు విజయవంతంగా జరిగాయని దేవస్థానం ఏసీ ఆర్.గంగా శ్రీదేవి, ఉత్సవ ప్రత్యేకాధికారి చందన తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, గ్రామ స్థులు అందించిన సహకారం అభినందనీయ మంటూ కృతజ్ఞతలు తెలిపారు.

రీ సర్వేతోనే భూ సమస్యలు

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



కైకలూరు గ్రామసభలో పాల్గొన్న ఇన్‌చార్జి తహసీల్దార్ ఇబ్రహీం

కలిదిండి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో చేపట్టిన రీ సర్వేతోనే అనేక భూ సమస్యలు తలెత్తాయని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆవకూరులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రైతులు రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, సర్పంచ్ నరహరిశెట్టి నరసయ్య, తహసీల్దార్ రామకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు ఆర్డీవో సమావేశం

కలిదిండి మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం రెవెన్యూ సమస్యలపై ఆర్డీవో అచ్యుతా అంబరీష్‌తో రైతులతో సమావేశం నిర్వహిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు తెలిపారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ హాజరవుతారన్నారు. ఇంగిలిపాక లంక, ఉనికిలి, కలిదిండి మండలంలో వివిధ గ్రామాల్లో రెవెన్యూ సమస్యలపై ఆర్డీవోతో కలసి చర్చిస్తా రన్నారు.

నియంత పాలనకు గొప్ప గుణపాఠం

ముదినేపల్లి : రైతుల భూములతో కూడా రాజకీయాలు చేయాలనుకున్న వైసీపీ నియంతృత్వ పాలనకు ప్రజలు గత ఎన్నికల్లో చరిత్ర కనీవిని ఎరుగని రీతిలో గొప్ప గుణపాఠం చెప్పారని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. వైవాకలో బుధవారం మీ భూమి - మీ హక్కు నినాదంతో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ జగన్ రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలపై తన ఫొటో ముద్రించుకుని నియంతలా వ్యవహరించారని విమర్శించారు. మండల ప్రత్యేకాధికారి టి.శ్రీనివాస్, తహసీల్దార్ సుభానీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్, నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు పాల్గొన్నారు.

45 రోజుల్లో సమస్య పరిష్కారం

కైకలూరు : రీసర్వేలో జరిగిన తప్పు ఒప్పులపై రైతులు, ప్రజలు గ్రామసభల దృష్టికి తీసుకురావాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం సూచించారు. కైకలూరు పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై 45రోజుల్లో పరిష్కారం చూపుతామన్నారు. సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, అధికారులు పాల్గొన్నారు.



ముదినేపల్లి వద్ద హడావిడిగా ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తుతున్న రైతులు



రోడ్డు పక్కన పరదాలు కప్పిన ధాన్యం రాశులు

వెంటాడుతున్న అల్పపీడనం

ముదినేపల్లి, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): అల్పపీడనం అన్నదాతను వణికి స్తోంది. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు రావడం, మంగళవారం రాత్రి భారీ వర్షం కురియడంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండాపోయింది. మండలం లో వందలాది ఎకరాల్లో నేలకొరిగిన వరి పైరు కోసేందుకు పనికి వస్తుందా? లేదా అన్న ఆందోళన కలిగిస్తోంది. వర్షంతో బెంబేలెత్తిపోయిన రైతులు రోడ్ల వెంబడి ఆర బెట్టిన ధాన్యాన్ని రక్షించుకునేందుకున ఆనా పాట్లు పడుతున్నారు. ముదినేపల్లి నుంచి గుడివాడ జాతీయ రహదారిలో పెదపాల పర్రు వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం రోడ్డు వెంబడి వందలాది మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయి. వారం రోజులుగా ఆరబెట్టి అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యాన్ని తిరిగి రాశులుగా చేసి బుధవారం పరదాలు కప్పేశారు.

ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి : బంగాళాఖాతంలో అల్ప పీడనం ప్రభావంతో వాతావరణంలో మార్పులతో వర్షాలు కురుస్తుండటంతో చేపలు, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ లోపించి చేపలు, రొయ్యల చనిపోయే ప్రమాదం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల మత్స్యశాఖాధికారి రవికుమార్ అన్నారు. మూల్లంకలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖాధికారి విద్యాసాగర్, ఫిషరీష్ అసిస్టెంట్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

కలిదిండిలో సీపీఎం ధర్నా

కలిదిండి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ బుధవారం కలిదిండిలో సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అదానితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోతే ప్రజలను సమీకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు సాగిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులను తగులబెట్టారు. సీపీఎం నాయకులు శేషపు మహంకాళిరావు, భాస్కరరావు, మాధవరావు, మహేష్, వినోద్, సత్యనారాయణ, బాలాజీ, నాగేంద్రరావు, మురళీ నాగన్న తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

విద్యుత్ ట్రూఅప్ చార్జీలను తక్షణమే తగ్గించాలి

ముసునూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూఅప్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యావర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. ముసునూరు మెయిన్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. అదానితో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసి ప్రజలపై మోపిన విద్యుత్ భారం తగ్గించాలన్నారు. రైతాంగానికి ఆర్థికంగా నష్టం కలిగించే స్మార్ట్ మీటర్లు బిగింపు రద్దు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో కాకుండా ప్రజలపై పన్నుల భారం తగ్గించి, పేద మధ్య తరగతి ప్రజల జీవన విధానాన్ని మెరుగుపర్చేలా పాలన సాగించాలని ఆయన కోరారు. ధర్నాలో మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస రావు, కె.దుర్గారావు, రమేష్, కుటుంబరావు, మురళీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలను బలోపేతం చేయాలి

ముసునూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంగా సర్పంచులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో జి.రాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ బుధవారంతో ముగిసింది. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక భద్రత, విద్య, ఆరోగ్యం తదితర అంశాలను ఉండేలా చూడాలన్నారు. ప్రణాళికబద్ధంగా అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, ఈవోపీఆర్డీ బీపీ.సత్యనారాయణ, పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్, ఎస్ఎస్ ఏఈ బాబురావు, ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వినోదం మిశ్రా వర్ధంతి

ముసునూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుళ్ళపూడిలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో వినోదం మిశ్రా వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏఐసీసీటీయు జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య పార్టీ జెండాను ఆవిష్కరించి మిశ్రా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోషలిస్టు, లౌకిక, సార్వభౌమ, ప్రజాస్వామిక, భారత రిపబ్లిక్‌ను కాపాడుకుని రాజ్యాంగ నిబద్ధతను కాపాడుకుంటూ నిజమైన సామాజిక పరివర్తన మానవ విముక్తిని సాధించాలని మిశ్రా ఆశించారని, ఆశయ సాధనకు కృషి చేయాలని బక్కయ్య అన్నారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు పామర్తి రామారావు, వేముల చంటి, ఆముదాల చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పార్థసారధి



సెమీక్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మంత్రి కొలుసు పార్థసారధి

నూజివీడు టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌సీఎం చర్చిలో బుధవారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. 10వ తరగతి, కళాశాల విద్యార్థులకు మంత్రి సారథి బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 255 క్రైస్తవ మంది రాలకు బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. కూటమి నాయకులు, క్రైస్తవ పెద్దలు పాల్గొన్నారు.

పోతనపల్లిలో..

చాట్రాయి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లి ఏసుక్రీస్తు పార్థన మందిరంలో మంగళవారం రాత్రి సెమీ కిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ స్వామిదాసు మాట్లాడుతూ ఏసు బోధించిన ప్రేమ, కరుణ, సహనం విశ్వమానవాళికి అనుసరణీయమన్నారు. తోటి వారికి శక్తి మేరకు సాయపడాలన్నారు. హోప్ మినిస్ట్రీ డైరక్టర్ గెడ్డం సామ్యూల్ జాషువా ఆధ్వర్యంలో 100 మంది అనాథలు, వితంతువులు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. బొట్టు లక్ష్మణరావు, స్థానికులు డి.నాగేశ్వరరావు, సీతారామరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిని పరిశీలించిన ఉన్నతాధికారులు



ఆస్పత్రిలో పేషెంట్లను ఆరా తీస్తున్న వైద్య శాఖ జేడీ రత్నావళి

నూజివీడు టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఏరియా ఆసుపత్రిని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ జె.రత్నావళి బుధవారం సందర్శించారు. సీమాంక్‌లోని లేబర్ వార్డులో తల్లిబిడ్డల క్షేమ సమాచారాన్ని ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి జనరల్, సర్జికల్ వార్డులను ఆమె పరిశీలించారు. తల్లిబిడ్డ క్షేమసమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరిచి వైద్యసేవలను పారదర్శకంగా అందించే క్రమంలో నూజివీడు ఏరియా ఆసుపత్రిని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, ముందుకు సాగుతున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్రసింగ్, ఇతర వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





చనుబండ, ముసునూరు సదస్సులలో అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్లు ప్రశాంతి, రమణ

ఆరు అంకెల ఖాతా రైతులకు ఇబ్బందులు

చాట్రాయి, డిసెంబరు 18(అంధ్రజ్యోతి): మండలంలో ఆరు అంకెలు ఖాతా నెంబర్లు ఉన్న భూములు ఆన్‌లైన్ కావడం లేదని, పాస్ పుస్తకాలు రావడం లేదని, రిజిస్ట్రేషన్లు జరగడం లేదని టీడీపీ నాయకుడు నక్కా రాము తహసీల్దార్ ప్రశాంతి దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో చనుబండలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ సమస్యతో చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నరశింహారావుపాలెంలో రెవెన్యూ సదస్సు జరిగింది. మొత్తం 16 అర్జీలు వచ్చినట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కందుల కృష్ణ, మారేశ్వరరావు, బ్రహ్మయ్య, నెక్కలపు వెంకటేశ్వరరావు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● ముసునూరు: ముసునూరు సచివాలయం వద్ద బుధవారం జరిగిన రెవెన్యూ గ్రామ సభలో 11అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వి రమణ తెలిపారు. ఈ గ్రామసభలకు ప్రొటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులను రెవెన్యూ అధికారులు ఆహ్వానించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ అధికారులు ప్రొటోకాల్ పాటించాలనే విషయం తెలియదా అని స్థానికులు, కూటమి నాయకులు సైతం ప్రశ్నిస్తున్నారు. అధికారులు రైతుల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో మస్తాన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పథకాలు పునరుద్ధరించాలి

చాట్రాయి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని కోరుతూ విజయవాడలో బీజేపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి సాదినేని యామినికి మండల బీజేపీ నాయకుడు బుర్రి శ్రీకర్ బుధవారం వినతిపత్రం అందజేశారు. 2014 నుంచి 19 వరకు భవన నిర్మాణ కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పేదలకు మేలు జరిగిందని, వైసీపీ పాలనలో ఐదేళ్లు పథకాలు నిలిపివేయడం వలన భవన నిర్మాణ కార్మికులు అనేక కష్ట నష్టాలకు గురయ్యారని వివరించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని యామిని హామీ ఇచ్చారని శ్రీకర్ చెప్పారు.

రేపు ట్రిపుల్ ఐటీలో మెగా జాబ్ మేళా

నూజివీడు టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో శుక్రవారం నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగం వేచిచూస్తున్న ప్రతిఒక్కరూ జాబ్ మేళాలో పాల్గొని ప్రముఖ బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలను పొందవచ్చన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చాట్రాయి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): చాట్రాయి సబ్‌స్టేషన్‌లో కొత్త లైన్లు ఏర్పాటు కోసం గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 వరకు చాట్రాయి టౌన్, బూరుగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సంజయ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

మంత్రిపై దుష్ప్రచారం తగదు

చాట్రాయి, డిసెంబరు(ఆంధ్రజ్యోతి): నూజివీడులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ విషయంలో మంత్రి పార్థసారథిపై కొందరు కుట్రపూరితంగా దుష్ప్రచారం చేయడం తగదని జనసేన మండల నాయకుడు తుమ్మల జగన్ అన్నారు. గౌడ సంఘం ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులను ఆహ్వానించారని, అందులో భాగంగానే మంత్రి పార్థసారథి వెళ్లారని దీన్ని చిలవలు పలవులు చేసి ఆయన బురద చల్లడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికైనా ఇటువంటి వాటికి స్వస్తి చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

20 లీటర్లు సారా స్వాధీనం

చాట్రాయి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లి పెద్ద తండాలో బుధవారం జరిపిన దాడిలో 20 లీటర్లు కాపు సారా స్వాధీనం చేసుకొని 800 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు.